మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 15-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 | సంచిక: 255 Issue: 255

Published from Jagitial
Circulated to Telangana

15 మార్చి 2026 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:27 సూర్యాస్తమయం - సా. 6:22 తిథి ఏకాదశి ఉ. 9:14 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం శ్రవణ తె. 5:48 వరకు తరువాత ధనిష్ఠ యోగం పరిఘ ఉ. 10:16 వరకు కరణం బాలవ ఉ. 9:14 వరకు కౌలవ రా. 9:30 వరకు వర్జ్యం ఉ. 9:00 నుండి ఉ. 10:40 వరకు దుర్ముహూర్తం సా. 4:46 నుండి సా. 5:34 వరకు రాహుకాలం సా. 4:53 నుండి సా. 6:22 వరకు యమగండం మ. 12:25 నుండి మ. 1:54 వరకు గుళికాకాలం మ. 3:23 నుండి సా. 4:53 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:51 నుండి తె. 5:39 వరకు అమృత ఘడియలు రా. 7:02 నుండి రా. 8:42 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:01 నుండి మ. 12:49 వరకు

## అమెరికా దాడి..



ఖర్గ్ ఐలాండ్.. చమురుకు సంబంధించి ఇరాన్‌కు వ్యూహాత్మక హబ్. ఇరాన్ నుంచి ఎగుమతి అయ్యే దాదాపు 90 శాతం చమురు ఇక్కడే ప్రాసెస్ అవుతుంది. ఇలాంటి స్థావరంపై యూఎస్ సెంట్రల్ కమాండ్ దాడి చేసింది. దాడిని ధ్రువీకరించిన ఇరాన్, చమురు మౌలిక సదుపాయాలకు మాత్రం ఎలాంటి నష్టం జరగలేదని తెలిపింది. దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఈ ప్రాంతంలో అమెరికాతో సంబంధం ఉన్న మౌలిక సదుపాయాలను తుడిచిపెట్టేస్తామని హెచ్చరించింది.

## ఇరాన్ ప్రతిదాడి..



యూఏఈలో అతిపెద్ద ఇంధన నిల్వల కేంద్రమైన పుజైరా ఓడరేవుపై ఇరాన్ డ్రోన్‌లతో దాడి చేసింది. దీంతో ఇక్కడ తీవ్ర మంటలు చెలరేగాయి. ఈ పుజైరా చమురు కేంద్రం ప్రపంచంలోనే పెద్దది. పుజైరా కీలక ఇంధన నిల్వ కేంద్రం కావడంతో ఇరాన్ దీనిని లక్ష్యంగా చేసుకుంది. పుజైరా ఆయిల్ డిపో, పోర్టుపై బాంబులు, మిసైళ్లతో దాడికి పాల్పడింది. వెంటనే అప్రమత్తమైన యూఏఈ పుజైరా చమురు పోర్టును తాత్కాలికంగా మూసివేసింది. చమురు ఎగుమతులు, దిగుమతులను నిలిపివేసింది.

# అంజన్న చెంతకు బండి

కాలినడకన కరీంనగర్ నుంచి కొండగట్టు వరకు

**11 గంటల్లో 40 కిలోమీటర్ల పాదయాత్ర**

**దారిపొడవునా స్వాగతం పలికిన కాషాయ శ్రేణులు**

**కేంద్ర మంత్రితో కలిసి నడిచిన బీజేపీ కార్యకర్తలు**

**పాదయాత్రతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ**

**దారిలో డ్రోన్ తగిలి పలువురిపై తేనెటీగల దాడి**

కేంద్ర మంత్రి బండి సంజయ్ తన మొక్కును తీర్చుకునేందుకు కరీంనగర్ నుండి కొండగట్టు వరకు 'అంజన్న ఆశీర్వాద యాత్ర' పేరిట నిర్వహించిన పాదయాత్ర ఘనంగా ముగిసింది. రాత్రి 10: 30 గంటల ప్రాంతంలో ఆయన కొండగట్టు గుట్టమీదికి చేరుకున్నారు. అయితే, అప్పటికే ఆలయం మూసివేయడంతో, ప్రధాన ద్వారం వద్దే కొబ్బరికాయ కొట్టి యాత్రను పూర్తి చేశారు.



కరీంనగర్, గంగాధర, మల్యాల, మార్చి 14 (ఈవార్తలు): ఈ సందర్భంగా కొండగట్టు ఆలయ ఈవో ఆయనను సన్మానించగా, వేదపండితులు ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ తన వెంట -2 వ పేజీలో...



# కారెక్కనున్న జీవన్ రెడ్డి?

## ఉగాదిలోగా కాంగ్రెస్‌కు గుడ్‌బై!

**25లోగా బీఆర్ఎస్‌లో చేరే అవకాశం.. జగిత్యాల వర్గాల్లో జోరుగా చర్చ**

కాంగ్రెస్ అధిష్టానం పట్ల తీవ్ర అసంతృప్తిలో ఉన్న ఆ పార్టీ సీనియర్ నేత జీవన్‌రెడ్డి.. బీఆర్ఎస్‌లోకి వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి.. కారు ఎక్కేందుకు జీవన్‌రెడ్డి పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఈ నెల 20లోపే కాంగ్రెస్‌కు రాజీనామా చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఉగాది పండుగ లోపే కొత్త నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాల ద్వారా తెలుస్తోంది.

జగిత్యాల బ్యూరో, మార్చి 14 (ఈవార్తలు): దీనిపై ఇప్పటికే కార్యకర్తలతో జీవన్‌రెడ్డి మాట్లాడారని, ఈ క్రమంలోనే ఆయన అనుచరుల సోషల్ మీడియా డీపీలు కూడా మారిపోవడంతో రాజీనామా వార్తలకు మరింత బలం చేకూరుస్తుంది. అదే సమయంలో జీవన్‌రెడ్డి -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,966 |
| వెండి (గ్రాము): | రూ.280 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,029 |

## విశ్వవాణి



తన పరిధిలో ఉన్న అమెజాన్ అడవిలో ఆయిల్, మైనింగ్ ప్రాజెక్టులను నిషేధిస్తున్నట్లు కొలంబియా ప్రభుత్వం స్పష్టం చేసింది. అడవిని కాపాడుకొనే చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.





# బాధ్యతలేని కాంగ్రెస్

## ప్రజల్లో కావాలనే భయాందోళనలు

**జాతీయ ప్రయోజనాల్లో ఆ పార్టీ ఫెయిల్.. ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆగ్రహం**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం మనపై ఉందని, ఒక విధంగా యుద్ధం లాంటి పరిస్థితి కనిపిస్తోందని, ఇలాంటి తరుణంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ దేశంలో, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గౌహతి: కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. అసోంలోని సిల్చార్‌లో ప్రధానమంత్రి పర్యటించారు. ఇక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో ఆందోళనలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జాతీయ ప్రయోజనాల విషయంలో ఆ పార్టీ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో భయాందోళనలు సృష్టించి తనను వేధించాలని చూస్తున్నారని అన్నారు. మనదేశ అభివృద్ధిని జీర్ణించుకోలేని శక్తుల చేతుల్లో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారుతోందని ఆరోపించారు. అసోం ప్రజలు ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీని ఎప్పుడో తరిమి కొట్టారని కితాబిచ్చారు. రానున్న ప్రతి ఎన్నికల్లో ప్రతి రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతుందని తరువాయి 2 వ పేజీలో...




# రేపు గుజరాత్‌కు ఎల్పీజీ నౌకలు

న్యూఢిల్లీ: భారతదేశ జెండాలు కలిగిన రెండు ఎల్పీజీ నౌకలు శనివారం సురక్షితంగా హోర్ముజ్ జలసంధిని దాటాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఈ జలసంధిని ఇరాన్ మూసివేసిన విషయం తెలిసిందే. దీనితో హోర్ముజ్‌కు ఇరువైపుల వందలాది నౌకలు తరువాయి 2 వ పేజీలో...



## ఇండక్షన్ స్టవ్‌లకు గిరాకీ

**ఒక్కరోజే 1.34 లక్షల స్టవ్స్ అమ్మకం**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల కొరత ప్రభావం రోజురోజుకు స్పష్టంగా కనిపిస్తోంది. వంట గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల కోసం వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలోనే విద్యుత్ ఆధారిత



# బాటిళ్లలో పెట్రోల్ అమ్మొద్దు

## బంకులకు కేంద్రం వార్నింగ్

ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పెట్రోల్, డీజిల్‌ను సీసాలు, డబ్బాలు వంటి విడి పాత్రలలో నిల్వ చేసుకోవడంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన జారీ చేసింది. అదే సమయంలో, దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

న్యూఢిల్లీ: ఇటీవల తమిళనాడులోని ఒక రిటైల్ అవుట్‌లెట్‌లో వినియోగదారుడికి లూజ్ కంటైనర్‌లో పెట్రోల్ పోసిన విషయం తమ దృష్టికి వచ్చిందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది భద్రతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, అందుకే ఆ పెట్రోల్ బంక్ లైసెన్సును తక్షణమే సస్పెండ్ చేసి, సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకున్నామని వెల్లడించింది. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో, దేశంలోని -2 వ పేజీలో...

## విదేశీయులకు 30 రోజుల వీసా పొడిగింపు

**యుద్ధం ఎఫెక్ట్‌తో భారత ప్రభుత్వం నిర్ణయం**




2

# రాశి ఫలాలు

15.3.2026

మేషం: ఉద్యోగస్తులకు పని ఒత్తిడి పెరిగి విశ్రాంతి లభించదు. చేపట్టిన పనులలో అవరోధాలు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు మరింత నిరాశ కలిగిస్తాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంటుంది.

వృషభం: ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. కొన్ని ముఖ్యమైన విషయాలలో కుటుంబ సభ్యుల సలహాలు కలిసివస్తాయి. వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఉద్యోగమున వివాదాలు సర్దుమణుగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. కుటుంబ వాతావరణం సందడిగా ఉంటుంది.

మిధునం: గృహమున వివాహ ప్రస్తావన వస్తుంది. ఆలోచనలు ఆచరణలో పెడతారు. బంధుమిత్రులు నుండి శు భవార్తలు అందుతాయి. నూతన వస్తు వాహన లాభాలు పొందుతారు. వృత్తి వ్యాపారాలలో ఆత్మవిశ్వాసంతో నిర్ణయాలు తీసుకుని లాభపడతారు. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కర్కాటకం: సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఆకస్మికంగా ప్రయాణాలు వాయిదా వేస్తారు. ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు అంతంత మాత్రంగా ఉంటాయి. ఉద్యోగస్తులకు పనిభారం పెరుగుతుంది. సంతాన విద్య ఉద్యోగ విషయాలలో కొంత నిరుత్సాహం తప్పదు.

సింహం: చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు ఉంటాయి. బంధుమిత్రులతో మాట పట్టింపులుంటాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలలో మరింత ఒత్తిడి పెరుగుతుంది. ఉద్యోగస్తులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. నిరుద్యోగులకు మరింత కష్టం తప్పదు.

కన్య: సంతానానికి నూతన విద్యావకాశాలు లభిస్తాయి. కొన్ని వ్యవహారాలలో అవరోధాలు ఉన్నప్పటికీ నిదానంగా పూర్తిచేస్తారు. పాత మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలను అందుకుంటారు. వృత్తి వ్యాపారాలలో నష్టాలు భర్తీ చేస్తారు. ఉద్యోగస్తులకు శుభవార్తలు అందుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

తుల: ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. అనుకొన్న సమయానికి పనులు పూర్తి కావు. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. బంధు మిత్రులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపారస్తులకు వచ్చిన అవకాశాలు చేజారిపోకుండా చూసుకోవాలి. ఉద్యోగ విషయంలో ఉన్నతాధికారులతో ఊహించని సమస్యలు కలుగుతాయి.

వృశ్చికం: కుటుంబ సభ్యులతో శుభకార్యాలకు హాజరవుతారు. దైవ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఉన్నత ఫలితాలను పొందుతారు. ఉ ద్యోగస్తులకు శ్రమకు అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

ధనస్సు: ఇంటా బయట ఊహించని సమస్యలు ఎదురవుతాయి. చేపట్టిన కార్యక్రమాలలో స్వల్ప వివాదాలు ఉంటాయి. దాయాదులు తో స్థిరాస్తి వివాదాలు తప్పవు. వృత్తి వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగ వాతావరణం నిరుత్సాహ పరుస్తుంది. దూర ప్రయాణాల వలన శారీరక శ్రమ పెరుగుతుంది. ధన పరంగా జాగ్రత్తగా వ్యవహరించాలి.

మకరం: వృత్తి వ్యాపారాలలో మరింత పుంజుకుంటాయి. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి అవుతాయి. బంధు మిత్రుల సహాయ సహకారాలు అందుతాయి. స్థిరాస్తి వివాదాలు రాజీ చేసుకుంటారు. ఉ ద్యోగస్తులకు సహోద్యోగుల సహాయంతో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది.

కుంభం: అనుకున్న పనులు వేగవంతంగా పూర్తి చేస్తారు. సమాజంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. మిత్రులతో సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో చాలా కాలంగా వేధిస్తున్న సమస్యల నుంచి బయటపడతారు. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది.

మీనం: కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆశ్చర్యపరుస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలలో అవాంతరాలు ఉ ంటాయి. దీర్ఘ కాలిక రుణ ఒత్తిడి పెరగటం వలన శారీరక మానసిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు నత్తనడకగా సాగుతాయి. ఉద్యోగమున ఒడిదుడుకులు పెరుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ తప్పదు.





# అంజన్న చెంతకు బండి

మొదటి పేజీ తరువాయి

కాలినడకన నడిచిన ప్రతి బీజేపీ కార్యకర్తకు రుణపడి ఉంటానని అన్నారు. ప్రధాని మోదీ స్ఫూర్తి వల్లే తన యాత్ర సాధ్యమైందని తెలిపారు. కాగా, కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి, మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటే నూతన ప్రజాప్రతినిధులతో కలిసి కొండగట్టుకు కాలినడకన వస్తానని గతంలో ప్రకటించారు. ఆ మాట ప్రకారం, కరీంనగర్ మేయర్ పీఠం దక్కడంతో ఈ యాత్రకు శ్రీకారం చుట్టారు. శనివారం ఉదయం 6 గంటలకు కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బండి సంజయ్ ఈ పాదయాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో ఆయన వెంట కరీంనగర్ నూతన మేయర్, కార్పొరేటర్లు, సుమారు 10 వేల మంది కార్యకర్తలు పాల్గొని అంజన్న నామస్మరణతో ముందుకు సాగారు. కరీంనగర్ లోకసభ నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులందరినీ ఏకం చేస్తూ ముందుకు సాగారు. దారిలో రేకుర్తి, కొత్తపల్లి, వెదిర, కురిక్యాల, గంగాధర ఎక్స్ రోడ్డు, పూడూరు మీదుగా కొండగట్టుకు చేరుకున్నారు. మొత్తం 11 గంటల పాటు 40 కిలోమీటర్లు నడిచారు.

### తేనెటీగల దాడి

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పాదయాత్ర సందర్భంగా తేనెటీగలు దాడి చేశాయి. రామడుగు మండలం కోన్‌రావుపేట సమీపంలో పాదయాత్ర దృశ్యాలను చిత్రీకరించేందుకు పలువురు అభిమానులు డ్రోన్ ఎగురవేశారు. అది పక్కనే ఉన్న చెట్టుకు ఉన్న తేనెతుట్టెకు తగిలింది. దీంతో తేనెటీగలు లేచి, పలువురు కార్యకర్తలపై దాడి చేశాయి. తేనెటీగల దాడితో కార్యకర్తలు భయాందోళనకు గురయ్యారు. తేనెటీగలు నలుగురు కార్యకర్తలపై దాడి చేశాయి. అప్రమత్తమైన బండి సంజయ్, ఆయన సిబ్బంది వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో పాదయాత్రకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. అనంతరం వైద్యులు బండి సంజయ్‌కి రొటీన్ వైద్య పరీక్షలు చేశారు.

### ట్రాఫిక్‌కు అంతరాయం

బండి సంజయ్ కుమార్ చేపట్టిన పాదయాత్ర సందర్భంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా ఏర్పడింది. భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనడంతో ప్రధాన రహదారులపై వాహన రాకపోకలకు అంతరాయం కలగడంతో గంటలకు కొద్ది ట్రాఫిక్ నిలిచిపోయిన పరిస్థితి కనిపించింది. కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం వరకు నిర్వహిస్తున్న ఈ పాదయాత్రలో వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. దీంతో కరీంనగర్ – జగిత్యాల ప్రధాన రహదారులపై వాహనాలు నెమ్మదిగా కదలడం లేదా కొంతసేపు పూర్తిగా నిలిచిపోయిన పరిస్థితులు కనిపించాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వెళ్లే వాహనదారులు, ఉ ద్యోగులు, వ్యాపారులు కొంతసేపు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని చోట్ల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ రద్దీ స్పష్టంగా కనిపించింది. అయితే, ఈ దారిలో వెళ్లే అంబులెన్స్‌కు ఎలాంటి ఆటంకం కలగకుండా వాటిని పంపించారు.

# కారెక్కనున్న జీవన్ రెడ్డి?

మొదటి పేజీ తరువాయి



సోషల్ మీడియా గ్రూపుల డీపీలు, ప్రొఫైల్స్ కూడా మారిపోతున్నాయి. తాను కాంగ్రెస్‌లో సీనియర్‌గా ఉండి కూడా ఆ పార్టీలో ప్రాధాన్యం లేకపోవడాన్ని జీవన్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. ఎమ్మెల్యే సంజయ్ వర్గానికి కాంగ్రెస్ అధిక ప్రాధాన్యం ఇచ్చి, తనను పట్టించుకోకపోవడంతో జీవన్‌రెడ్డి వేరే స్టెప్ తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు. జగిత్యాలలో కాంగ్రెస్ మున్సిపల్ చైర్‌పర్సన్ గెలుపుపై విచారం వ్యక్తం చేశారు. చైర్మన్ స్థానం దక్కినందుకు సంతోషపడలా? లేక బాధ పడాలా? అర్థం కావడం లేదన్నారు. సమిండ్ల శ్రీనివాస్ అనే వ్యక్తి ఎమ్మెల్యే సంజయ్‌ను కలిసిన కొద్ది రోజుల్లోనే చైర్‌పర్సన్ పదవిలో కూర్చోవడమేంటని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనే అసంతృప్తి జ్వాలలకు ఆజ్యం పోసినట్లు అయ్యిందని చర్చ జరుగుతోంది. కార్యకర్తలతో సుదీర్ఘ మంతనాల తర్వాతే జీవన్‌రెడ్డి పార్టీ మారే యోచనకు వచ్చారనే చర్చ నడుస్తోంది. జగిత్యాలలో భారీ సభ ఏర్పాటు చేసి బీఆర్ ఎస్ కండువా కప్పుకోవడానికి ఇప్పటికే జీవన్‌రెడ్డి రంగం సిద్ధం చేసుకున్నారని తెలుస్తోంది. గౌరవం లేని చోట కొనసాగడం కంటే బయటకు రావడమే మేలని ఆయన ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అందులోభాగంగా నే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. త్వరలోనే ఈ విషయంపై క్లారి టీ రానుంది. అయితే, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో జీవన్ రెడ్డికి దశాబ్దాల అనుబంధం ఉంది. ఆయన హస్తం పార్టీని వీడితే జగిత్యాల, చుట్టుపక్కల నియోజక వర్గాల్లో ఆ పార్టీకి ఇబ్బందులు తప్పవు. ఏదేమైనా, ఉగాది తర్వాత జగిత్యాల రాజకీయాలు హీట్ పుట్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పీఎన్‌జీ వినియోగదారులకు ఎల్పీజీ బంద్

## చమురు సంస్థలకు కేంద్రం కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో పలు దేశాల్లో ఇంధన భయాందోళనలు నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే భారత్‌లో కూడా అలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ఇంధన కొరత ప్రచారం నేపథ్యంలో సామాన్య ప్రజానీకం అవసరం లేకపోయినప్పటికీ ముందు జాగ్రత్తగా వంట గ్యాస్ సిలిండర్ల బుకింగ్ చేస్తున్నారు. అంతేకాకుండా వంట గ్యాస్ సిలిండర్ల కోసం గ్యాస్ ఏజెన్సీల ముందు బారులు తీరుతున్నారు. అయితే దేశంలో ఎల్పీజీ కొరత లేదని కేంద్రప్రభుత్వం చెబుతుంది. గ్యాస్ సిలిండర్లపై కేంద్రం కొన్ని పరిమితులు విధించింది. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకమారు ఎల్‌పీజీ బుక్ చేసుకోవాలని వినియోగదారులకు సూచించింది. అయితే ఎల్‌పీజీ సిలిండర్ల ఆందోళన నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా నిబంధనలను సవరించింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ శనివారం ఒక కీలక ప్రకటన చేసింది. సవరించిన సరఫరా నిబంధనల ప్రకారం... పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) కనెక్షన్ ఉన్న వినియోగదారులు ఇకపై డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్లను కలిగి ఉండటం, పొందడం, రీఫిల్ చేయడంపై నిషేధం విధించింది. ఈ సవరణ ప్రకారం.. ఇప్పటికే పీఎన్‌జీ కనెక్షన్ ఉన్న వారికి కొత్త ఎల్‌పీజీ కనెక్షన్లు ఇవ్వకూడదని లేదా సిలిండర్లను రీఫిల్ చేయకూడదని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది.

# బాధ్యతలేని కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి

అన్నారు. అసోం పట్ల లేదా దేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కానీ మోదీని ఎలా విమర్శించాలో, అబద్ధాలు చెప్పి ప్రజలను ఎలా తప్పుదారి పట్టించాలో తెలుసని ఎద్దేవా చేశారు. కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నాయకులు చొక్కాలు విప్పి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కూడా ప్రధాని స్పందించారు. వారి చర్యను యావత్ దేశం ఖండించిందని అన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ పార్టీ దేశం పైనే దాడికి దిగిందని మండిపడ్డారు. నిరాశతో దుస్తులు చించుకోవడం తప్ప వారికి మిగిలిందేమీ లేదని అన్నారు.

## బాటిళ్లలో పెట్రోల్ అమ్మొద్దు

మొదటి పేజీ తరువాయి

అన్ని రిటైల్ అవుట్‌లెట్లు,డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. ఇంధనాన్ని సరఫరా చేసేటప్పుడు భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పెట్రోల్ వంటి మండే స్వభావం ఉన్న ఇంధనాన్ని అసురక్షిత పద్ధతుల్లో నిల్వ చేయడం వల్ల తీవ్రమైన అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం సూచించింది.

# రేపు గుజరాత్‌కు ఎల్పీజీ నౌకలు

మొదటి పేజీ తరువాయి

నిలిచిపోయాయి. భారత ప్రభుత్వం సంప్రదింపుల నేపథ్యంలో, భారత జెండాలు కలిగిన నౌకలు వెళ్లడానికి ఇరాన్ అంగీకరించింది. ఈ క్రమంలో రెండు నౌకలు హార్ముజ్‌ను దాటాయి. శివాలిక్, నందాదేవి పేరు గల నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు. ఈ నౌకల్లో సుమారు 92 వేల టన్నుల ఎల్పీజీ ఉందని, మార్చి 16 లేదా 17వ తేదీన ఇవి భారత్‌కు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. అటు.. గృహ వినియోగదారులకు వంట గ్యాస్ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని కేంద్రం హామీ ఇచ్చింది. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించింది. అవసరం లేకున్నా చాలామంది ఆందోళనతో బుకింగ్ చేస్తున్నారని, అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని కోరింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని రాష్ట్రాలని కోరినట్లు కేంద్రం తెలిపింది. ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది.

# ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు క్లియర్

## లబ్ధిదారుల అకౌంట్లలోకి 28.5 కోట్లు జమ

హైదరాబాద్, మార్చి 14 (ఈవార్తలు): ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు పెండింగ్‌లో ఉన్న రూ. 28.5 కోట్లు బిల్లులను క్లియర్ చేసింది. ఇందుకు సంబం ధించి తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ వివరాలను వెల్లడిం చారు. 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ గత వారంలో రూ. 28.50 కోట్ల విలువైన పెండింగ్ ఇందిరమ్మ గృహ బిల్లులను క్లియర్ చేసిందని తెలిపారు. దీని వలన 2,764 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరిందని చెప్పారు. ఎల్ 3 కేటగిరీ కింద 1,200 మంది లబ్ధిదారులకు రూ. 12.06 కోట్లు విడుదల చేసినట్టుగా తెలిపారు. అలాగే, గత చెల్లింపులు విఫలమైన 653 మంది లబ్ధిదారులకు రూ.7 కోట్లు క్లియర్ చేసినట్టుగా చెప్పారు. వివరణాత్మక ధ్రువీకరణ తర్వాత 911 మంది లబ్ధిదారులకు రూ. 9.40 కోట్లు విడుదల చేయడానికి కూడా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు చెల్లింపు సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు... ఆధార్-బ్యాంక్ అకౌంట్ లింకేజ్, వ్యక్తిగత వివరాలను సరిచేయాలని లబ్ధిదారులకు సూచించారు.

# ఇండక్షన్ స్టవ్‌లకు గిరాకీ

మొదటి పేజీ తరువాయి

ఇండక్షన్ స్టవ్‌లకు భారీగా డిమాండ్ పెరిగింది. గ్యాస్ సిలిండర్లు సకాలంలో లభించకపోవడం, కొన్నిచోట్ల బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయాలు జరగడం వల్ల వినియోగదారులు ఇండక్షన్ స్టవ్‌ల వైపు మొగ్గు చూపుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. సాధారణంగా దేశవ్యాప్తంగా నెలకు సుమారు 1.80 లక్షల ఇండక్షన్ స్టవ్‌లు అమ్ముడవుతుంటాయి. అయితే ఇటీవల గ్యాస్ కొరత నేపథ్యంలో ఈ సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. ప్రముఖ ఈ-కామర్స్ వేదిక అమెజాన్‌లో ఒక్క రోజులోనే 1.34 లక్షలకు పైగా ఇండక్షన్ స్టవ్‌లు అమ్ముడైనట్లు సమాచారం. ఇది సాధారణ అమ్మకాలతో పోలిస్తే అనూహ్యంగా పెరిగిన సంఖ్యగా మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇండక్షన్ స్టవ్‌లకు ఒక్కసారిగా పెరిగిన డిమాండ్ కారణంగా అనేక నగరాల్లో స్టాక్ కొరత ఏర్పడింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లతో పాటు ఎలక్ట్రానిక్స్ దుకాణాల్లో కూడా ఇండక్షన్ స్టవ్‌లు వేగంగా అమ్ముడైపోతున్నాయి. ఫలితంగా చాలాచోట్ల అవుట్ ఆఫ్ స్టాక్ బోర్డులు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. డిమాండ్‌కు తగినంత సరఫరా లేకపోవడంతో కంపెనీలు కూడా కొత్త స్టాక్ పంపిణీపై దృష్టి సారిస్తున్నాయి.

# విదేశీయులకు 30 రోజుల వీసా పొడిగింపు

## యుద్ధం ఎఫెక్ట్‌తో భారత ప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రభుత్వం విదేశీయులకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయాలు తీసుకుంది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా విమాన రాకపోకలకు అంతరాయం కలగడంతో భారత్‌లో చిక్కుకుపోయిన విదేశీయుల కోసం వీసా గడువు పెంపు, జరిమానాల మినహాయింపును ప్రకటించింది. దుబాయ్‌లోని భారత కాన్సులేట్ వెల్లడించిన వివరాల ప్రకారం, గడువు ముగిసిన లేదా త్వరలో ముగియనున్న వీసాలు, ఈ-వీసాలను ఉచితంగా ఒక నెల పాటు పొడిగించనున్నారు. ఫిబ్రవరి 28 తర్వాత యుద్ధం కారణంగా అనివార్యంగా భారత్‌లో ఉండిపోయిన విదేశీయులకు ఓవర్‌స్టే పెనాల్టీని కూడా పూర్తిగా మినహాయించారు. ప్రయాణ మార్గాలు పునరుద్ధరించిన తర్వాత వారు తిరిగి వెళ్ళడానికి అవసరమైన ఎగ్జిట్ పర్మిట్లను కూడా ఉచితంగానే జారీ చేయనున్నారు. ఒకవేళ ఎవరైనా సాంకేతిక కారణాల వల్ల వీసా పొడిగింపునకు దరఖాస్తు చేయలేకపోయినా, దానిని నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబోమని అధికారులు స్పష్టం చేశారు. అలాగే, విమానాల దారి మళ్లింపు వల్ల భారత్‌లో దిగే విదేశీయులకు తాత్కాలిక ల్యాండింగ్ పర్మిట్లను కూడా ఉచితంగా మంజూరు చేయనున్నారు. మరోవైపు, ఖతార్ ఎయిర్‌వేస్ ద్వారా సుమారు 500 మంది భారతీయులు సురక్షితంగా దోహా నుంచి కొచ్చి, ఇతర ప్రాంతాలకు చేరుకున్నారు. ఖతార్ గగనతలం పాక్షికంగానే తెరిచి ఉండటంతో విమాన సర్వీసులు పరిమితంగా నడుస్తున్నాయి.

# 17న సంగారెడ్డిలో పీఐబీ మీడియా వర్క్ షాప్

హైదరాబాద్, మార్చి 14 (ఈవార్తలు): సంగారెడ్డి జిల్లా విలేకరుల కోసం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) హైదరాబాద్ విభాగం ఈ నెల 17న వార్తాలాప్ మీడియా వర్క్షాప్ నిర్వహించనుంది. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ ఈ వర్క్షాప్‌లో పాల్గొంటారు. మహిళపై లింగ ఆధారిత హింస, స్త్రీ సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జర్నలిజంలో కృత్రిమ మేధ వినియోగంపై ఈ కార్యక్రమంలో అవవగాహన కల్పిస్తారు. ఈ అంశాలపై ప్రముఖ పాత్రికేయురాలు సజయ కాకర్ల, ఫ్యాక్ట్ చెక్ శిక్షణ నిపుణురాలు సత్యప్రియ బీఎన్ జర్నలిస్టులకు దిశానిర్దేశం చేస్తారు. విలేకరులతో సమన్వయాన్ని బలోపేతం చేయడం, వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు, పత్రిక రంగంలో వస్తున్న నూతన మార్పులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించనున్న ఈ వర్క్‌షాప్‌లో సంగారెడ్డి జిల్లా పాత్రికేయులు పాల్గొనాలని పీఐబీ- హైదరాబాద్ విభాగం కోరింది.

# మెట్రో-ర్యాపిడో భాగస్వామ్యం

## హైదరాబాద్‌లో సులభతర ప్రయాణం



హైదరాబాద్, మార్చి 14 (ఈవార్తలు): హైదరాబాద్ మహానగరంలో ప్రజారవాణా వ్యవస్థ కొత్త పుంతలు తొక్కుతోంది. ముఖ్యంగా మెట్రో రైలు సేవలు, బైక్ ట్యాక్సీ అగ్రిగేటర్ 'ర్యాపిడో' మధ్య కుదిరిన వ్యూహాత్మక భాగస్వామ్యం నగరవాసుల ప్రయాణ అనుభవాన్ని పూర్తిగా మార్చేస్తోంది. ఇంటి నుంచి మెట్రో స్టేషన్‌కు చేరుకోవాలన్నా, మెట్రో దిగాక గమ్యస్థానానికి వెళ్లాలన్నా ఎదురయ్యే 'ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీ' సమస్యకు ఈ కలయిక చక్కని పరిష్కారం చూపుతోంది. ఈ రెండు సేవల అనుసంధానంతో ప్రయాణం మరింత వేగంగా, సులభంగా మారింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో రోజూ సుమారు 4.28 లక్షల మంది మెట్రోలో ప్రయాణిస్తుండగా, వీరిలో దాదాపు 1.5 లక్షల మంది తమ ప్రయాణ ప్రారంభ, ముగింపు దశల కోసం బైక్ లేదా ఆటో సేవలపై ఆధారపడుతున్నారు. నగరంలో నమోదయ్యే 10 లక్షలకు పైగా రోజువారీ రైడ్లలో ర్యాపిడో ఒక ప్రధాన డిజిటల్ భాగస్వామిగా నిలుస్తోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో జరిగే ప్రయాణాల్లో 50 శాతం ర్యాపిడో ద్వారానే జరుగుతుండటం దీని ప్రాధాన్యతను తెలియజేస్తోంది. అంతేకాకుండా ప్రయాణికులు ర్యాపిడో యాప్ ద్వారానే రోజుకు సగటున 30 వేల మెట్రో టికెట్లను కొనుగోలు చేస్తుండటం ఈ భాగస్వామ్యం ఎంతగా విజయవంతమైందో స్పష్టం చేస్తోంది. ఈ వ్యవస్థ కేవలం ప్రయాణికులకు సౌకర్యాన్ని అందించడమే కాకుండా లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పించే వేదికగా కూడా మారింది. హైదరాబాద్‌లో ప్రస్తుతం 5.4 లక్షల మందికి పైగా రైడర్లు ర్యాపిడో ద్వారా సేవలందిస్తున్నారు. పనివేళలు, పనితీరును బట్టి ఒక్కో రైడర్ రోజుకు రూ. 3,000 నుంచి రూ. 4,000 వరకు సంపాదించే అవకాశం ఉందని సంస్థ వర్గాలు చెబుతున్నాయి. ఇది గిగ్ ఎకానమీలో భాగంగా ఎన్నో కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇస్తోంది. ఈ పరిణామంపై ర్యాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి మాట్లాడుతూ... ఒకే వేదికపై మెట్రో, బైక్, ఆటో వంటి బహుళ రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడం గొప్ప విషయమని అన్నారు. దీనివల్ల ప్రజలు సొంత వాహనాల వినియోగాన్ని తగ్గించుకుని ప్రజారవాణా వైపు మొగ్గు చూపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. తద్వారా నగరంలో ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం గణనీయంగా తగ్గుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. సాంకేతికతను జోడించి రవాణాను సులభతరం చేయడం ద్వారా హైదరాబాద్ నగరం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను అందుకుంటోందని వివరించారు.



# నెతన్యాహు చనిపోయారా?

## సోషల్ మీడియాలో ప్రచారాలు హల్‌చల్

జెరూసలెం: ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ భీకరదాడులు, ఇరాన్ సుప్రీం నేత హత్య తరువాత ఇరాన్‌కూడా అదే స్థాయిలో ప్రతిదాడులకు దిగింది. దీంతో సోషల్ మీడియాలో పలు అసత్య ప్రచారాలు, ఫేక్ వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. తాజాగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు చనిపోయారంటూ సమాచారం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఇజ్రాయెల్ ప్రధాని అధికారికసోషల్ మీడియా ఖాతా నుండి ఆయన మరణించారని ప్రకటించిన సందేశానికి పోస్ట్ కావడంతో ఒక్కసారిగా గందరగోళం చెలరేగింది. దీనికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌లు వైరల్‌గా మారాయి. అంతేకాదు ఇటీవల ఆయన మీడియాతో మాట్లాడిన వీడియో ఏఐతో రూపొందించారనే ఊహాగానాలు వెల్లువెత్తాయి. పాత వీడియోకు కొత్త వాయిస్‌ను జోడించారనే పుకార్లు షికారు చేశాయి. నెతన్యాహు దేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న వీడియో వైరల్ అయింది. దీంతో వీడియోలు నెతన్యాహుకు ఆరు వేళ్లు ఉన్నట్టు కనిపించిందనీ, ఇది ఏఐతో సృష్టించిన వీడియో అని రూమర్లు వ్యాపించాయి. అసలు ఆయన బతికే ఉన్నారా అనే ఆందోళన రేగింది. జియోనిస్ట్ నాయకుడు ఎక్కడ ఉన్నాడనేది సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు వచ్చింది. అయితే, ఇజ్రాయెల్ నాయకుడి మరణం గురించి ఆన్‌లైన్‌లో వ్యాపించిన పుకార్లను అనేక ఫ్యాక్ట్ చెక్ సంస్థలు, ఫ్యాక్ట్-చెకర్లు , వార్తా సంస్థలు ఇప్పటికే తోసిపుచ్చాయి.నెతన్యాహు సురక్షితంగా ఉన్నారనీ, సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న వీడియో ఏఐ సృష్టి అని తేలింది. ఈ వీడియోలు ఫేక్ వీడియోలు అని ఫ్యాక్ట్ చెక్ నిపుణులు తేల్చారు.

# గ్యాస్‌పై కృత్రిమ కొరత సృష్టి

## ప్రజలను భయపెడుతున్నారు.. కాంగ్రెస్‌పై రాంచందర్ రావు ఫైర్

హైదరాబాద్, మార్చి 14 (ఈవార్తలు): గ్యాస్ కొరత, మూసీ ప్రాజెక్టు అంశాలపై ప్రభుత్వ తీరును తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా ఎండగట్టారు. దేశంలో అసలు గ్యాస్ కొరత అనేదే లేదని స్పష్టం చేసిన ఆయన, కొంతమంది కావాలనే లేని కొరతను సృష్టించి ప్రజలను భయపెడుతున్నారని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితుల వల్ల అనేక దేశాల్లో ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నా, ప్రధాని మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం భారత్‌లో ధరలను నియంత్రణలో ఉంచిందని గుర్తుచేశారు. గతంలో రూ. 1,200 వరకు ఉన్న గ్యాస్ ధరను రూ. 900లకు తగ్గించి సామాన్యుడిపై భారం తగ్గించిన ఘనత కేంద్రానిదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు విషయంలో బీజేపీ వైఖరిని స్పష్టం చేస్తూ, తాము నది శుద్ధికి వ్యతిరేకం కాదని, కానీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇళ్లను కూల్చడాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని రాంచందర్ రావు హెచ్చరించారు. మూసీ ప్రాజెక్టు కోసం 50 మీటర్ల బఫర్ జోన్ అవసరమే లేదని, కేవలం ఒక గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం 100 ఎకరాల భూమిని సేకరించాలని చూడటం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. గుజరాత్‌లో సబర్మతి ప్రాజెక్టును ఎవరికీ నష్టం కలగకుండా ఏ విధంగా పూర్తి చేశారో ప్రభుత్వం గమనించాలని సూచించారు.

# గ్యాస్ కొరత లేదు: ఉత్తమ్

హైదరాబాద్, మార్చి 14 (ఈవార్తలు): తెలంగాణలో వంటగ్యాస్ కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజలు గ్యాస్ సిలిండర్ ధరలు పెరుగుతాయని లేదా కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో ముందుగానే ఎక్కువగా బుక్ చేసుకుంటున్నారని, దీనితో సాధారణం కంటే రెట్టింపు సిలిండర్లు బుక్ అవుతున్నాయని తెలిపారు. తెలంగాణలో గృహ అవసరాలకు ఎలాంటి వంటగ్యాస్ కొరత లేదని, వాణిజ్య సిలిండర్ల కొరత మాత్రమే ఉందని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో 810 మంది ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని, ప్రస్తుత పరిస్థితులపై వారితో చర్చించామని మంత్రి తెలిపారు. తెలంగాణలో 1.3 కోట్ల మంది ఎల్పీజీ వినియోగదారులు ఉన్నట్లు వెల్లడించారు. దీపం పథకం కింద 28 లక్షల మంది ఎల్పీజీని వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. గృహ వినియోగదారులు ప్రతి నెల 60 లక్షల సిలిండర్లు ఉపయోగిస్తున్నట్లు చెప్పారు.




# పెళ్లికి నో చెప్పిందని ఎయిడ్స్ రక్తం ఎక్కించాడు!

పోచారం-హైదరాబాద్, మార్చి 15 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని పోచారం ప్రాంతంలో అత్యంత అమానుషమైన ఘటన చోటుచేసుకుంది. తనను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించిందనే కక్షతో ఓ యువకుడు, యువతికి హెచ్ఐవీ సోకిన రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా బలవంతంగా ఎక్కించాడు. 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాను తలపించిన ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళితే... పోచారానికి చెందిన మనోహర్ అనే యువకుడు ఎయిడ్స్ బాధితుడు. అతనికి, అతని తల్లిదండ్రులకు కూడా ఈ వ్యాధి ఉంది. అయితే, ఈ విషయాన్ని దాచిపెట్టి ఓ యువతితో వివాహానికి సిద్ధపడ్డాడు. విషయం తెలుసుకున్న ఆ యువతి పెళ్లికి నిరాకరించింది. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్న మనోహర్, ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11న యువతి ఇంటికి వెళ్లిన మనోహర్.. పెళ్లికి ఒప్పుకోవాలని ఒత్తిడి చేశాడు. ఆమె అందుకు ససేమిరా అనడంతో తన వెంట తెచ్చుకున్న సిరంజిలోని హెచ్ఐవీ రక్తాన్ని ఆమె శరీరంలోకి బలవంతంగా ఎక్కించాడు. ఈ ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు మనోహర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# ఆయిల్‌పామ్‌తో లాభాలు: తుమ్మల

సిద్దిపేట, మార్చి 14 (ఈవార్తలు): రైతులు ధైర్యంగా ఆయిల్ పామ్ పంట వేయాలని తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఈ పంటకు నీటి సమస్య, మార్కెట్ సమస్య లేదని అన్నారు. అన్ని విధాలా రైతులకు లాభాలు ఇచ్చే పంట ఆయిల్ పామ్ అని వెల్లడించారు. సిద్దిపేట, జనగామ జిల్లాలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని మరో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. రైతులకు పెట్టుబడి, ఎరువులు అన్నీ అందిస్తున్నామని తెలిపారు. తాను మంత్రిగా వచ్చిన సమయానికి ఆయిల్ పామ్ టన్ను రూ.12 వేలు ఉండేదని, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి టన్ను ధర రూ.20 వేలకు పైగా పెంచామని చెప్పారు. నర్మెట్టలో త్వరలో రైతు మేళా నిర్వహిస్తామని అన్నారు.

# నేడు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో డీజేఎస్ భేటీ

హైదరాబాద్, మార్చి 14 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటలు నుంచి 3:30 గంటల వరకు డెస్క్ జర్నలిస్టుల సంఘం (డీజేఎస్) సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో డెస్క్ జర్నలిస్టుల సంక్షేమం, ప్రయోజనాల పరిక్షణ, భవిష్యత్తు కార్యాచరణ, కార్యవర్గ ఎంపిక తదితర అంశాలపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో డెస్క్ జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొనాలని డీజేఎస్ కోరింది.

# భారతి బిల్డర్స్‌పై రెరా కొరడా

## డబ్బు వాపసు చేయాలని ఆదేశం

హైదరాబాద్, మార్చి 14 (ఈవార్తలు): నిబంధనలను ఉల్లంఘించి ప్రీ-లాంచ్ స్కీమ్ పేరుతో కొనుగోలుదారుల నుంచి డబ్బులు వసూలు చేసిన భారతి బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రెరా) కఠిన చర్యలు తీసుకుంది. ఆ సంస్థకు మొత్తం రూ. 4.74 కోట్ల భారీ జరిమానా విధించడంతో పాటు, దానిని 'డిఫాల్టర్ ప్రమోటర్'గా ప్రకటించింది. బాధితులకు 60 రోజుల్లో వడ్డీతో సహా పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కొంపల్లిలోని 'భారతీ లేక్ వ్యూ అపార్ట్‌మెంట్స్' ప్రాజెక్టుకు సంబంధించి పలువురు కొనుగోలుదారులు రెరాకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అథారిటీ, బిల్డర్ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. 2021లో ప్రీ-లాంచ్ ఆఫర్ల ద్వారా కొనుగోలుదారుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసిన భారతి బిల్డర్స్, 24 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. అయితే, రెరా రిజిస్ట్రేషన్ గానీ, ఇతర చట్టబద్ధమైన అనుమతులు గానీ లేకుండానే నిధులు సేకరించి, ఇంతవరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై రెరా ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రాజెక్టు పూర్తయ్యే సూచనలు కనిపించకపోవడంతో, కొనుగోలుదారులు అందులో కొనసాగాల్సిన అవసరం లేదని అథారిటీ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, బాధితులు చెల్లించిన పూర్తి మొత్తాన్ని వడ్డీతో కలిపి 60 రోజుల్లోగా వాపసు చేయాలని ఆదేశించింది. ఈ ప్రాజెక్టులో భాగస్వామి అయిన 'శ్రీ భారతి' అనే మరో సంస్థను కూడా ప్రమోటర్‌గా పరిగణిస్తూ, రెండు సంస్థలూ ఉమ్మడిగా ఈ బాధ్యత వహించాలని తీర్పునిచ్చింది. నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను భారతి బిల్డర్స్‌పై కొత్తగా రూ. 3.55 కోట్లు జరిమానా విధించింది. గతంలో ఇదే తరహా ఉల్లంఘనలకు విధించిన రూ. 1.18 కోట్ల జరిమానాకు ఇది అదనమని రెరా పేర్కొంది. ఈ సందర్భంగా రెరా ప్రజలకు కీలక సూచనలు చేసింది. రెరా రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టులలో 'ప్రీ-లాంచ్' ఆఫర్లు చట్టవిరుద్ధమని, అలాంటి పథకాలలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని హెచ్చరించింది. రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టులపై రెరా పర్యవేక్షణ ఉండదని, ఎస్క్రో ఖాతా వంటి ఆర్థిక భద్రతలు కొనుగోలుదారులకు లభించవని స్పష్టం చేసింది. ఏదైనా ప్రాజెక్టులో ఫ్లాట్ కొనుగోలు చేసే ముందు, దాని రెరా రిజిస్ట్రేషన్ వివరాలను అధికారిక వెబ్‌సైట్లో ధ్రువీకరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.



# మీసాలకు సంపెంగ నూనె లెక్క!

## రేవంత్ మూసీ ప్రాజెక్టుపై కేటీఆర్ ఎద్దేవా

హైదరాబాద్, మార్చి 14 (ఈవార్తలు): ఖజానాలో డబ్బులు లేవంటూనే, వేలకోట్ల రూపాయలతో మూసీ ప్రాజెక్టును చేపడతానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి వ్యవహారం చాలా వింతగా ఉందని అన్నారు. తినడానికి మెతుకు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనె అన్నట్లుగా ఆయన తీరు ఉందని ఎద్దేవా చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్లు దండుకుంటామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని ఒకవైపు చెబుతూనే, మరొకవైపు మూసీ ప్రాజెక్టును చేపడతానని చెప్పడమేమిటని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా మూసీ సుందరీకరణ చేపట్టారని వెల్లడించారు. అసలు మూసీ మురికి కూపంగా మారింది కాంగ్రెస్ హయాంలోనే అని ముఖ్యమంత్రి గుర్తించాలని అన్నారు. మూసీ పునరుజ్జీవంపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. శుక్రవారం ముఖ్యమంత్రి మాట్లాడిన సమయంలో, మూసీ బాధితులకు ఉపశమనం ఇచ్చే ప్రకటన ఏదైనా చేస్తారా అని చూశామని, కానీ ఆ ప్రస్తావనే లేదని విమర్శించారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని ముఖ్యమంత్రి చెబుతున్నారని, రైతుబంధు, రిటైర్డ్ ఉద్యోగులకు కూడా ఇచ్చేందుకు డబ్బులు లేవని చెప్పారని, కానీ ఇప్పుడు మూసీ ప్రాజెక్టు పూర్తి చేసి తీరుతానని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. 2 వేల కిలోమీటర్ల నమామి గంగే ప్రాజెక్టు ఖర్చు రూ.42,500 కోట్లు అని, గుజరాత్ సబర్మతికి అయిన ఖర్చు రూ.7 వేల కోట్లు అని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. అందాల పోటీలు నిర్వహించడానికి రూ.200 కోట్లు ఖర్చు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, హామీల అమలుకు మాత్రం డబ్బులు లేవంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ఒక్క ఇంటినైనా నిర్మించిందా అని ప్రశ్నించారు.

# రాష్ట్రంలో ఆల్‌టైమ్ గరిష్ఠానికి విద్యుత్ వినియోగం

హైదరాబాద్, మార్చి 14 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో ఈ నెల 13వ తేదీన 341 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. దీనితో తెలంగాణలో వినియోగం ఆల్ టైమ్ గరిష్ఠానికి చేరుకుంది. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధికం కావడం, వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం పెరగడంతో రాష్ట్రంలో రోజురోజుకీ విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.



# భట్టి ఇంటికి చంద్రబాబు

## భట్టి కుమారుడు-కోడలుకు ఆశీర్వాదం

హైదరాబాద్, మార్చి 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం హైదరాబాద్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నివాసానికి వెళ్లారు. ఇటీవల వివాహం చేసుకున్న భట్టి కుమారుడు సూర్య విక్రమాదిత్య, కోడలు సాక్షిలను ఆశీర్వదించేందుకు చంద్రబాబు ఆయన ఇంటికి చేరుకున్నారు. చంద్రబాబుకు భట్టి విక్రమార్క సాదర స్వాగతం పలికారు. అనంతరం నూతన దంపతులను కలిసిన చంద్రబాబు, వారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. దంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు కాసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ఇటీవల భట్టి విక్రమార్క తన కుమారుడి వివాహానికి చంద్రబాబును ఆహ్వానించేందుకు స్వయంగా అమరావతికి వెళ్లారు. అయితే, అప్పటి పనుల ఒత్తిడి కారణంగా చంద్రబాబు వివాహ వేడుకకు హాజరు కాలేకపోయారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పర్యటనలో భాగంగా భట్టి ఇంటికి వెళ్లి నూతన దంపతులకు విషెస్ తెలియజేశారు. మార్చి 5న శంషాబాద్ జీఎంఆర్ ఎరీనాలో జరిగిన ఈ వివాహ వేడుకకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సినీనటుడు చిరంజీవి వంటి పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరైన విషయం తెలిసిందే.



# జగిత్యాల ముస్లిం కమిటీ ఎన్నికల కమిషనర్‌గా ఇమ్రాన్

జగిత్యాల, మార్చి 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని జమా మసీద్‌లో ముస్లిం మత పెద్దలు, ముస్లిం కమిటీ సమావేశం నిర్వహించి సెంట్రల్ ముస్లిం కమిటీ ఎన్నికల కమిషనర్‌గా సీనియర్ జర్నలిస్ట్ మొహమ్మద్ ఇమ్రాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఎన్నికల కమిషనర్‌గా ఉన్న మహమ్మద్ అలీ గత నాలుగు సంవత్సరాలుగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన లెక్కలు చూపించకపోవడంతో పాటు నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపిస్తూ మత పెద్దలు ఆయనను తొలగించారు. నూతనంగా ఎన్నికైన కమిషనర్ మొహమ్మద్ ఇమ్రాన్‌ను మత పెద్దలు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ భారీ, జనరల్ సెక్రటరీ హాజా నయుముద్దీన్ మంజూర్, అబ్దుల్ సజీద్, అఖీల్ ఉద్దిన్ జావీద్, పట్వారీ సాజిద్, పట్వారీ ముజాహిద్, మున్సిపల్ వైస్ చైర్మన్ మున్నా, కౌన్సిలర్లు కమల్, అయూబ్ ఖాన్, అఫ్రోజ్, అహ్లే హదీస్, జగిత్యాల కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రషీద్, జమాతే ఇస్లామియా నాయకులు ఈమాదుద్దీన్, తౌహీద్ అలీ, పాత్రికేయులు మోసిక్, హైదర్ అలీ, అదిల్, ఫజల్ తదితరులు పాల్గొన్నారు



# ముస్లిం మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ

హైదరాబాద్, మార్చి 14: రంజాన్ పండుగ సందర్భంగా.. అన్వర్ ఉల్ ఉలూం ఇన్‌స్టిట్యూషన్స్ సెక్రటరీ నవాబ్ మహబూబ్ అలంఖాన్ ఆధ్వర్యంలో అంబర్ పేట ఏకే ప్లాజా ఫంక్షన్ హాల్ లో శనివారం మహిళలకు నిత్యవసర సరుకులు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ నవాబ్ ముజాహిద్ అలంఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి సంవత్సరం రంజాన్ పండుగ సందర్భంగా మైనారిటీ సోదరీమణులకు ఈ రంజాన్ కిట్లు అందించడం తమకు గొప్ప సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. రంజాన్ మాసం శాంతి సహనం సేవ భావాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. సమాజంలో సామరస్యం పెంపొందించడంలో ఇలాంటి సేవాకార్యక్రమాలు ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు.



## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షుడిగా ఎంబీ విజయ్ కుమార్ యాదవ్

హైదరాబాద్, మార్చి 14: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షుడిగా ఎంబీ విజయ్‌కుమార్ యాదవ్ నియమితులయ్యారు. విజయ్ కుమార్ యాదవ్ నియామకాన్ని ఉద్యోగుల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు ఎం రాఘవయ్య, ప్రధానకార్యదర్శి ఎన్ఎస్ పిళ్లై నిర్ధారించారు. ఐఎన్టీయుసీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా విజయ్ కుమార్ యాదవ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ గవర్నింగ్ బాడీ సభ్యుడిగా సేవలందిస్తూ కార్మికుల సంక్షేమం, భద్రత కోసం ఆయన కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం నారాయణగూడలోని ఐఎన్టీయుసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్యలో అనుభవజ్ఞులైన నాయకులను నాయకత్వంలో చేర్చడం ద్వారా సంస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఇది దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎం.రాఘవయ్యకు, ఎన్ఎస్ పిళ్లైకి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రజల కోసం ఎక్కడికైనా వస్తా

### జనసేన అధినేత పవన్ కల్యాణ్

### గిరిజనుల మధ్య జనసేన ఆవిర్భావ వేడుకలు

### పాడేరులో ఏపీ డిప్యూటీ సీఎం పర్యటన

అల్లూరి జిల్లా, మార్చి 14 (ఈవార్తలు): తమది 'పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం' అని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామం నందిగరువులో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో 'మాట-మంతి' కార్యక్రమం నిర్వహించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "గత ప్రభుత్వంలో కనీసం సమస్యలు చెప్పుకోవడానికి కూడా ప్రజలు భయపడేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగమే మీ గడప వద్దకు వచ్చి సమస్యలు



తెలుసుకునేలా పాలనను ప్రక్షాళన చేశాం. మీరు కష్టాలు చెప్పుకోవడానికి రోడ్ల మీదకు రాకముందే వాటిని పరిష్కరించడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వం నిధులు మళ్లించడం వల్లే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని పవన్ కల్యాణ్ ఆరోపించారు. "జలజీవన్ మిషన్ పథకంలో రూ.4 వేల కోట్లు దుర్వినియోగం చేశారు. కానీ మేము అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఏజెన్సీ గ్రామాల్లో 460 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించాం. గిరి శిఖర గ్రామాల్లో గర్భిణీలు పడుతున్న డోలీ కష్టాలు ఇక కనిపించకూడదన్నదే మా లక్ష్యం" అని వివరించారు. కేవలం 40 గడపలున్న నందిగరువు గ్రామానికి రూ.2 కోట్లతో రోడ్డు నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని లక్షలాది మంది మధ్య కాకుండా, 70 ఏళ్లుగా రోడ్డుకు నోచుకోని మారుమూల గిరిజన గ్రామంలో జరుపుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని పవన్ అన్నారు. "ఈ ప్రాంతంలో కూటమి అభ్యర్థులు గెలవకపోయినా మేము ఎక్కడా వివక్ష చూపించం. మీరు ఓట్లు వేశారా లేదా అని చూడకుండా, మీరు బాగుండాలనే పనిచేస్తాం. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ఇలాంటి ప్రాంతాలకు రావడానికి నాయకులు భయపడతారేమో కానీ, ప్రజల కోసం పనిచేసే నాకు ఎలాంటి భయాలు లేవు" అని స్పష్టం చేశారు. 'మాట-మంతి'లో భాగంగా గ్రామస్థులు ప్రస్తావించిన పలు సమస్యలకు పవన్ కల్యాణ్ అక్కడికక్కడే పరిష్కారాలు చూపారు. ఓనూరు పాఠశాల మరమ్మతులు, కొత్తపాలెం గ్రామానికి 1.6 కి.మీ. రోడ్డు మంజూరు, అసంపూర్తిగా ఉన్న పాఠశాల, అంగన్‌వాడీ భవనాల పూర్తికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లకుండా అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ చోరీ

### ఏపీలోని ఏలూరు జిల్లాలో ఘటన

ఏలూరు జిల్లా, మార్చి 14 (ఈవార్తలు): పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల ప్రభావం ఇప్పుడు సామాన్యుడి వంటింటిపై కూడా పడుతోంది. ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా ఉద్రిక్తతల వల్ల గ్యాస్ సరఫరాలో ఏర్పడిన అంతరాయం, దేశవ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల కొరతకు దారితీస్తోంది. గ్యాస్ సిలిండర్ల కోసం జనం గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సిన పరిస్థితి తలెత్తడంతో, అక్రమార్కులు దీనిని బ్లాక్ మార్కెట్ దందాకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇదే సమయంలో కొందరు దొంగలు సైతం తమ రూటు మార్చి, ఏకంగా ఇళ్లలోని గ్యాస్ సిలిండర్లను టార్గెట్ చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఏపీలోని ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో ఒక వింత దొంగతనం వెలుగుచూసింది. నిన్న అర్ధరాత్రి సమయంలో దొంగలు ఒక ఇంట్లోకి చొరబడి, అక్కడున్న గ్యాస్ సిలిండర్‌ను ఎత్తుకెళ్లారు. బయటకు వెళ్లిన బాధితులు తిరిగి వచ్చి చూసేసరికి సిలిండర్ కనిపించకపోవడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. చివరకు చేసేదేమీ లేక పోలీసులకు ఫిర్యాదు చేయగా, ప్రస్తుతం పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బావిలో పడి ముగ్గురు కూలీలు మృతి

### జయశంకర్ జిల్లాలో విషాదం

జయశంకర్ భూపాలపల్లి, మార్చి 14 (ఈవార్తలు): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్ళపల్లి మండలంలో విషాదం చోటు చేసుకుంది. కోర్కిశాల గ్రామంలో వ్యవసాయ బావి పూడిక తీస్తుండగా ప్రమాదవశాత్తు క్రేన్ బావిలో పడడంతో ముగ్గురు కూలీలు మృతి చెందారు. సుకినే వాసుదేవరావు (48), బండారి అభిలాష్ (16), పైడయ్య (53) ఈ ఘటనలో దుర్మరణం చెందారు. అభిలాష్ పదవ తరగతి పరీక్షలు రాసి కూలి పనికి వచ్చి మృత్యువాతపడ్డాడు.

## తమ్మినేనికి గుండె జబ్బు.. రాఘవులు పరామర్శ

హైదరాబాద్, మార్చి 14 (ఈవార్తలు): గుండెజబ్బుతో హైదరాబాద్ గచ్చిబౌలి ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రంను శనివారం ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పరామర్శించా రు. వారు ఆ దవాఖాన వైద్యులతో మా ట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.



# ఆన్‌లైన్‌లోనే గ్యాస్ బుకింగ్

### ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్

అమరావతి, మార్చి 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్రంలో గ్యాస్ సరఫరా, వినియోగానికి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ఇకపై తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని, దీనివల్ల బ్లాక్ మార్కెటింగ్‌ను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే 88 శాతం మంది వినియోగదారులు ఓటీపీ ద్వారా సిలిండర్లు తీసుకుంటున్నారని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ప్రభుత్వం, గ్యాస్ కంపెనీలు కఠిన చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. గ్యాస్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు విధించినట్టు తెలిపారు. డబుల్ సిలిండర్ ఉన్న వారికి 32 రోజుల చొప్పున రీఫిల్ బుకింగ్‌పై పరిమితి విధించినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల గ్యాస్ సరఫరాలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ... ఆసుపత్రులు, హాస్టళ్లు, గృహ అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పయ్యావుల కేశవ్ తెలిపారు. దేశీయంగా గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రిఫైనరీలను ఆదేశించిందని, ప్రస్తుతం 10 నుంచి 20 శాతం వరకు ఉత్పత్తి మన దేశంలోనే జరుగుతోందని వెల్లడించారు. హోటల్ అసోసియేషన్లతో కూడా చర్చలు జరుపుతున్నామని, వారు బొగ్గుతో నడిచే తందూరి బట్టీల వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారని చెప్పారు. సోలార్ కుకింగ్ విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ప్రధాన ఆలయాల్లో ఇప్పటికే స్టీమ్ కుకింగ్ అమలులో ఉందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో గ్యాస్ ధరలు పెరగకుండా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. సోమవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఆర్టీజీఎస్ ద్వారా అన్ని బృందాలతో సమావేశమై గ్యాస్ సరఫరా పరిస్థితిని సమీక్షించనున్నారని వెల్లడించారు. అధిక ధరలు వసూలు చేసే హోటళ్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# బీఆర్ నాయుడిపై చంద్రబాబు స్పందనేది?

### వైసీపీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి

విజయవాడ, మార్చి 14 (ఈవార్తలు): కూటమి ప్రభుత్వంపై వైసీపీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిపై వస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ... అలాంటి వ్యక్తులను పవిత్రమైన పదవుల్లో ఎలా నియమిస్తారని లక్ష్మీపార్వతి ప్రశ్నించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. దేవుడితో ఆడుకోవడం సరికాదని, మహిళలకు అన్యాయం చేసిన వారికి చరిత్రలో ఎలాంటి గతి పట్టిందో గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. చంద్రబాబు తన రాజకీయ లబ్ధి కోసం మహిళలను అడ్డం పెట్టుకుంటున్నా రని, ఇప్పుడు మేకతోలు కప్పుకుని మాట్లాడటం మానుకో వాలని హితవు పలికారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మహిళల భద్రత పూర్తిగా గాలికి వదిలేశారని, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై అఘాయిత్యాలు విపరీతంగా పెరిగిపోయాయని లక్ష్మీపార్వతి ఆందోళన వ్యక్తం చేశారు.




రాష్ట్రం ప్రస్తుతం 'అత్యాచారాల ఆంధ్రప్రదేశ్'గా మారిపోయిందని, సామాన్యులే కాకుండా ప్రజాప్రతినిధులుగా ఉన్న కొందరు ఎమ్మెల్యేలు కూడా మహిళలపై దారుణాలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. ఈ పాపాలను పంచుకోవడంలో జనసేన పార్టీ కూడా భాగస్వామి అవుతోందని విమర్శించారు. పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసి, వారిని కేవలం అధికార పార్టీ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని లక్ష్మీపార్వతి మండిపడ్డారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్ల ద్వారా మహిళలకు తక్షణ రక్షణ లభించేదని, కానీ నేడు ఆడపిల్లలను స్కూళ్లకు పంపాలన్నా తల్లిదండ్రులు భయపడే పరిస్థితి నెలకొందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# శబరిమల.. మహిళలకు నో ఎంట్రీ

### కేరళ ప్రభుత్వం సంచలన నిర్ణయం

శబరిమల: 50 ఏళ్లలోపు మహిళల్ని శబరిమల ఆలయంలోకి అనుమతించే అంశంపై కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై 10 నుంచి 50 ఏళ్లలోపు మహిళల్ని ఆలయంలోకి అనుమతించకూడదని నిర్ణయించింది. ఈ మేరకు కేరళం సీఎం పినరయి విజయన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో దీనిపై ఆమోదం లభించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. భక్తుల మనోభావాలు, ఏళ్లుగా వస్తున్న సంప్రదాయాల్ని దృష్టిలో ఉంచుకుని, వాటిని కాపాడాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, త్వరలోనే కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, రాజకీయ కోణంలోనే ఎల్డీఎఫ్ (లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్) ఈ నిర్ణయం తీసుకుందని రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. శబరిమల ఆలయంలోకి వయసుతో సంబంధం లేకుండా మహిళలకు ప్రవేశం కల్పించాలని కొన్నేళ్లక్రితం ఆందోళనలు చెలరేగాయి. అయితే, ఈ నిర్ణయాన్ని శబరిమల ఆలయ యాజమాన్య బాధ్యతలు చూసే ట్రావెన్‌కోర్ దేవస్థాన బోర్డు వ్యతిరేకించింది. ఎప్పటినుంచో ఉన్న సంప్రదాయం ప్రకారం.. మహిళలకు మెనుస్ట్రువల్ సైకిల్ ఉండే పదేళ్ల వయసు నుంచి 50 ఏళ్ల వయసు మహిళల్ని ఆలయంలోకి అనుమతించబోమని తెలిపింది. ఈ నిర్ణయాన్ని 2018లో ప్రభుత్వం వ్యతిరేకించింది. అన్ని వయసుల వారికి ఆలయ ప్రవేశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్యాంగం ఇచ్చిన హక్కు ప్రకారం



అందరు మహిళలు ఆలయంలోకి వెళ్లొచ్చని తెలిపింది. అయితే, ఇప్పుడు ఈ నిర్ణయాన్ని ఎల్డీఎఫ్ ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. పాత సంప్రదాయాల ప్రకారమే 50 ఏళ్లలోపు మహిళల ప్రవేశంపై నిషేధం విధిస్తామని కోర్టుకు తెలిపింది. ఈ అంశంలో ప్రభుత్వ నిర్ణయం ఏంటో చెప్పేందుకు తుది గడువు ఈ రోజే. అందుకే తాజా నిర్ణయాన్ని నేడు ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ఈ అంశంపై వచ్చే నెల 7 నుంచి సుప్రీంకోర్టులో వాదనలు జరగనున్నాయి. మరోవైపు ప్రభుత్వం యూటర్న్ తీసుకోవడంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఇంతకాలం ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడిన వారిపై నమోదైన కేసుల సంగతేంటని ప్రశ్నిస్తున్నాయి. ఈ నిరసనలకు సంబంధించి నమోదైన కేసుల్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది.

# ఢిల్లీలో కట్టెల పొయ్యిలకు కేంద్రం అనుమతి

న్యూఢిల్లీ: గ్యాస్ కొరత వేళ కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో కట్టెల పొయ్యిలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసిం ది. ఢిల్లీలో కట్టెల పొయ్యిలు వాడుకోవచ్చని ప్రకటించింది. ఢిల్లీలో కాలుష్యం ఎంతగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ నేపథ్యంలో వాయు కాలుష్యం మరింత పెరగకుండా ప్రభుత్వం ఎన్నో నిబంధనలను తీసుకొచ్చింది. అయినప్పటికీ, పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా భారత్‌లో గ్యాస్ కొరత నెలకొనడంతో ఇప్పుడు కట్టెల పొయ్యి వాడక తప్పడం లేదు. దీంతో దానిపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. కమర్షియల్ సిలిండర్ల కొరత నేపథ్యంలో దేశ వ్యాప్తంగా కొన్ని రెస్టారెంట్లలో కట్టెల పొయ్యిపై వంటలు మొదలయ్యాయి. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో జిల్లాలోనూ గ్యాస్ కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కొన్ని గ్యాస్ ఏజెన్సీలు హోటళ్లకు కమర్షియల్ సిలిండర్ల సరఫరా నిలుపుదల చేశాయి. కొందరికి మాత్రం పాత స్టాక్ ఉండడంతో ఎలాగోలా రెండు రోజులు నెట్టుకొచ్చారు. స్టాక్ లేని వారు కట్టెల పొయ్యిపై వంటలు చేయడం ప్రారంభించారు. ఇంకొందరు సుదూర ప్రాంతాల నుంచి గ్యాస్ తెచ్చుకొని రెస్టారెంట్లను నడుపుతున్నారు. మరోవైపు, పలు రాష్ట్ర ప్రభుత్వాలు హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాళ్లు, హాస్టళ్ల వంటివి మూడపడకుండా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి.



# నేపాల్‌లో రోడ్డు ప్రమాదం

### ఏడుగురు భారతీయులు మృతి

ఖట్మండు: నేపాల్‌లోని గోర్ఖా జిల్లాలో శనివారం సాయంత్రం జరిగిన భయానక రోడ్డు ప్రమాదంలో ఏడుగురు భారతీయ యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. మంకమ్నా ఆలయంలో దర్శనం ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం, సాహిద్ లఖన్ గ్రామీణ మునిసిపాలిటీ పరిధిలోని కాంతర్ ప్రాంతంలో భక్తులను తీసుకెళ్తున్న ఎలక్ట్రిక్ మైక్రోబస్ నియంత్రణ తప్పి కొండ రహదారి నుంచి లోతైన లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో మరో ఏడుగురు యాత్రికులు గాయపడగా, వారిని చికిత్స కోసం చిత్వాన్ జిల్లాలోని భరత్పూర్ పట్టణంలోని చిత్వాన్ మెడికల్ కాలేజీకి తరలించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాజ్‌కుమార్ శ్రేష్ఠ తెలిపిన వివరాల ప్రకారం, ప్రమాద సమయంలో మైక్రోబస్‌లో డజనుకు పైగా ప్రయాణికులు ఉన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. గోర్ఖా చీఫ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ తులసి బహదూర్ శ్రేష్ఠ మాట్లాడుతూ, ఈ మైక్రోబస్ మంకమ్నా ఆలయం నుంచి పశ్చిమ దిశగా తనహు జిల్లాలోని అన్బుఖైరేని ప్రాంతానికి వెళ్తున్నట్లు తెలిపారు. అయితే దర్శనం అనంతరం యాత్రికులు అసలు ఏ ప్రాంతానికి వెళ్తున్నారన్నది ఇంకా స్పష్టంగా తెలియలేదన్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా వెలుగులోకి రాలేదు. కొండ ప్రాంత రహదారిపై ప్రయాణిస్తుండగా మైక్రోబస్ అదుపు తప్పి లోయలో పడిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదే ప్రాంతంలో గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆగస్టు 2024లో భారతీయ యాత్రికులతో వెళ్తున్న బస్సు అన్బుఖైరేని సమీపంలో ప్రమాదానికి గురై కనీసం 27 మంది మరణించిన విషయం తెలిసిందే.



# హార్ముజ్ జలసంధిని తెరుస్తాం

## మీ యుద్ధ నౌకలను పంపండి

## పలు దేశాలకు ట్రంప్ పిలుపు

వాషింగ్టన్: హార్ముజ్ జలసంధిని త్వరలో అమెరికా తెరుస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. హార్ముజ్‌ను ఇరాన్ మూసివేయడంతో ప్రభావితమైన దేశాలు ఇక్కడకు నౌకలను పంపించాలని ఆయన సూచించారు. ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం 15వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఆయన చైనా, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియా, బ్రిటన్ లాంటి దేశాలకు కీలక విజ్ఞప్తి చేశారు. హార్మూజ్ జలసంధి రక్షణ కోసం ఆ దేశాలు నౌకలను పంపించాలని అన్నారు. అమెరికా నావికాదళం త్వరలో హార్ముజ్ జలసంధి నుంచి ప్రయాణించే నౌకలకు రక్షణ కల్పిస్తుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ట్రూత్ ప్లాట్‌ఫామ్ వేదికగా స్పందించారు. హార్ముజ్ జలసంధిని మూసివేసిన నేపథ్యంలో ప్రపంచంలోని అన్ని దేశాలు, ముఖ్యంగా ప్రభావితమైన దేశాలు అమెరికాతో కలిసి యుద్ధ నౌకలను పంపించాలని కోరారు. ఈ జలసంధిని మూసివేయడం వల్ల ప్రభావితమైన దేశాలు తమతో కలుస్తున్నాయని తెలిపారు. ఇరాన్ సైనిక స్థావరాలను 100 శాతం నాశనం చేశామని ట్రంప్ పేర్కొన్నారు. తల తెగిన ఇరాన్ లాంటి దేశంతో ముప్పు ఉండదని స్పష్టమవుతోందని అన్నారు. ఇరాన్ తీర ప్రాంతంపై అమెరికా దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. త్వరలో హార్ముజ్‌ను తెరుస్తామని, ఈ దారిని స్వేచ్ఛగా, సురక్షితంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. చైనా వంటి దేశాలు నౌకలను పంపిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## దుబాయ్ పోర్టుల నుంచి వెళ్లిపోండి

### యూఏఈ ప్రజలకు ఇరాన్ హెచ్చరిక

దుబాయ్: పశ్చిమాసియాలో అమెరికా–ఇజ్రాయెల్‌తో యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్న వేళ, ఇరాన్ సంచలన హెచ్చరికలు జారీ చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని మూడు కీలక ఓడరేవులను తమ చట్టబద్ధ లక్ష్యాలు (లెజిటిమేట్ టార్గెట్స్)గా ప్రకటించింది. ఆ ప్రాంతాల్లోని ప్రజలు తక్షణమే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. రాబోయే గంటల్లో ఈ పోర్టులపై దాడులు జరగవచ్చని సంకేతాలిచ్చింది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. దుబాయ్‌లోని జెబెల్ అలీ, అబుదాబిలోని ఖలీఫా, ఫుజైరా పోర్టులే తమ లక్ష్యాలని పేర్కొంది. ఈ ఓడరేవుల్లో పౌర ఆవాసాల మాటున అమెరికా సైనిక దళాలు దాగి ఉన్నాయని, కాబట్టి వాటిపై దాడి చేయడం తమకు చట్టబద్ధమైన హక్కని ఇరాన్ స్పష్టం చేసింది. హార్ముజ్ జలసంధిలో ప్రయాణించే నౌకలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. ఇరాన్‌కు చెందిన కీలకమైన ఖార్గ్ ద్వీపంపై అమెరికా దాడులు జరిపిన నేపథ్యంలోనే ఈ హెచ్చరికలు రావడం గమనార్హం. ఇరాన్ ముడిచమురు ఎగుమతుల్లో 90 శాతం ఈ ద్వీపం నుంచే జరుగుతాయి. అయితే, తాము సైనిక లక్ష్యాలనే ధ్వంసం చేశామని, చమురు క్షేత్రాలకు నష్టం కలిగించలేదని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్ కామ్) తెలిపింది. ఇరాన్ చర్యలపై యూఏఈ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ అధికారులు కొద్ది వారాల క్రితం తమ దేశంలో పర్యటించినప్పుడు ఇలాంటి దాడులకు పాల్పడతామని ఎలాంటి సూచన ఇవ్వలేదని, ప్రస్తుత హెచ్చరికలు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయని యూఏఈ విదేశాంగ మంత్రి లానా నుస్సీబెహ్ అన్నారు. తుపాకులు నిశ్శబ్దమయ్యాకే మధ్యవర్తిత్వంపై చర్చలు సాధ్యమని ఆమె స్పష్టం చేశారు. ఇప్పటికే సౌదీ అరేబియా, కతార్, కువైట్‌లలోని పలు ఇంధన కేంద్రాలపై ఇరాన్ దాడులు చేసింది. మరోవైపు, ఫుజైరా చమురు కేంద్రం వద్ద ఓ డ్రోన్‌ను కూల్చివేయగా, దాని శకలాలు పడి మంటలు చెలరేగాయి. దీంతో చమురు లోడింగ్ కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఈ పరిణామాలతో గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా, ప్రపంచ చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోంది.


## పుతిన్ ఇరాన్ యురేనియం ప్రతిపాదనకు ట్రంప్ నో

వాషింగ్టన్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేసిన ఓ ప్రతిపాదనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. ఇరాన్ శుద్ధిచేసిన యురేనియంను రష్యాకు తరలిస్తామని పుతిన్ ప్రతిపాదించగా, ట్రంప్ అంగీకరించలేదు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరువురు నేతలు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. యుద్ధంలో ఇరాన్‌కు పరిమితస్థాయిలో రష్యా సహకరిస్తుందనే వార్తల నేపథ్యంలో ఇరువురు నేతలు సంభాషించుకున్నారు. రష్యా నుంచి ఇలాంటి ప్రతిపాదన ఇదే మొదటిసారి కాదని అమెరికా చెబుతోంది. ఇంతకుముందు కూడా పుతిన్ ఇలాంటి ప్రతిపాదనలు చేశారని అమెరికా ప్రతినిధి ఒకరు వెల్లడించారు. యురేనియం సురక్షితంగా ఉండేలా చూసుకోవాలనేది అమెరికా వైఖరి అని తెలిపారు. మరోవైపు, పుతిన్ చేసిన ప్రతిపాదనకు ఇరాన్ కూడా అంగీకరించే అవకాశం లేదని తెలుస్తోంది. యుద్ధానికి ముందు అమెరికాతో జరిగిన చర్చల సమయంలో కూడా ఇరాన్ ఇటువంటి అంశాలను అంగీకరించలేదని తెలుస్తోంది.

## సోనమ్ వాంగ్‌చుక్ విడుదల

న్యూఢిల్లీ: లడఖ్‌కు చెందిన ప్రముఖ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌కు భారీ ఊరట లభించింది. ఆయనపై విధించిన జాతీయ భద్రతా చట్టం కింద నిర్బంధాన్ని రద్దు చేస్తున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. త్వరలోనే ఆయన విడుదల కానున్నారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు హోం శాఖ వెల్లడించింది. గతేడాది లడఖ్‌కు రాష్ట్ర హోదా, రాజ్యాంగపరమైన రక్షణలు కల్పించాలంటూ పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. ఈ క్రమంలో సెప్టెంబర్ 24న జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఈ ఘర్షణల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా, భద్రతా సిబ్బందితో సహా సుమారు 50 మంది గాయపడ్డారు. ఈ హింస జరిగిన రెండు రోజుల తర్వాత సోనమ్ వాంగ్‌చుక్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. రెచ్చగొట్టే ప్రసంగాలతో ప్రజలను హింసకు ప్రేరేపించారనే ఆరోపణలపై ఆయనపై జాతీయ భద్రతా చట్టం కింద కేసు నమోదు చేసి నిర్బంధంలో ఉంచారు. అప్పటి నుంచి దాదాపు ఆరు నెలలుగా ఆయన నిర్బంధంలోనే ఉన్నారు. తాజాగా కేంద్ర హోం శాఖ ఆయన నిర్బంధాన్ని ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.





## మోదీ నాకు మంచి దోస్త్: ట్రంప్

### త్వరలో భారత్‌కు వస్తానని సందేశం

న్యూఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారు. భారత్, భారత ప్రజల పట్ల తనకున్న ప్రేమను వ్యక్తం చేస్తూ, త్వరలోనే దేశంలో పర్యటించే అవకాశం ఉందని సూచనప్రాయంగా తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన ఓ సదస్సులో పాల్గొన్న అమెరికాకు చెందిన మితవాద కార్యకర్త, ట్రంప్ విధేయురాలు లారా లూమర్ చదివి వినిపించారు. ఈ సదస్సులో పాల్గొన్న లారా లూమర్, తాను వేదికపైకి రావడానికి సుమారు గంట ముందు అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడానని సభికులకు తెలిపారు. ఈ సందర్భంగా ట్రంప్ చెప్పిన మాటలను ఆమె యథాతథంగా వివరించారు. "నాకు ఇండియా అంటే చాలా ఇష్టం. నేను మోదీని ఎంతగానో ఇష్టపడతానని దయచేసి వారికి తెలియజేయండి. ప్రధాని మోదీ ఒక అద్భుతమైన నాయకుడు, నా మంచి స్నేహితుడు. త్వరలోనే మరో పర్యటన కోసం నేను కచ్చితంగా భారత్‌కు వస్తానని భారత ప్రజలకు చెప్పండి" అని ట్రంప్ తనతో అన్నట్లు లూమర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాలు, ప్రపంచ రాజకీయాలపై చర్చ జరుగుతున్న ఈ సదస్సులో లూమర్ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి.

## ఏపీపై పోరుకు కర్ణాటక వ్యూహం

బెంగళూరు: అప్పర్ కృష్ణా జలాల ప్రాజెక్టు (యూకేపీ) మూడో దశ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేవనెత్తుతున్న అభ్యంతరాలను బలంగా ఎదుర్కొనేందుకు కర్ణాటక సిద్ధమైంది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా, మార్చి 17న ఢిల్లీలో రాష్ట్ర ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. శనివారం బాగల్‌కోట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అప్పర్ కృష్ణా ప్రాజెక్టు, దానికి సంబంధించిన భూసేకరణను వ్యతిరేకిస్తూ ఏపీ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని తెలిపారు. దీనిపై కేంద్రం తమ నుంచి వివరణ కోరిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, ఏపీ వైఖరికి వ్యతిరేకంగా తమ వాదనను ఢిల్లీలో బలంగా వినిపిస్తామని శివకుమార్ స్పష్టం చేశారు. "ట్రైబ్యునల్ ఆదేశాల మేరకే మాకు కేటాయించిన నీటి వాటాను వినియోగించుకోవడానికి ప్రాజెక్టు పనులు చేస్తున్నాం. ఇప్పటికే సుమారు రూ. 26,000 కోట్ల విలువైన పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతానికి ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచే ఆలోచన లేదు. కేవలం మా వాటా నీటిని వాడుకోవడానికే ప్రయత్నిస్తుంటే, దానికి కూడా ఏపీ అభ్యంతరం చెప్పడం సరికాదు" అని ఆయన అన్నారు. ఇదే సమయంలో, తుంగభద్ర డ్యాం నుంచి కర్ణాటకకు చెందిన సుమారు 30 టీఎంసీల నీరు వృథాగా పోతోందని, ఈ వృథాను అరికట్టేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించేందుకు ఏపీ ప్రభుత్వం సహకరించడం లేదని శివకుమార్ ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై చర్చించి, కేంద్రంపై ఒత్తిడి పెంచే వ్యూహాన్ని ఖరారు చేసేందుకు తాను, మంత్రులు హెచ్.కే. పాటిల్, ఎం.బి. పాటిల్, బోసరాజులతో కలిసి మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నట్లు ఆయన వివరించారు.

## గ్యాస్‌పై కాంగ్రెస్ ఫేక్ ప్రచారం: కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ: ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో ఇంధన కొరతపై కాంగ్రెస్ పార్టీ అనవసర భయాందోళనలు సృష్టిస్తోందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా విమర్శించారు. పాత ఫోటోలను అడ్డుపెట్టుకుని ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తోందని శనివారం ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఓ పోస్ట్ చేశారు. 2011లో ఎల్పీజీ సిలిండర్ల కోసం ప్రజలు క్యూలో నిల్చున్న ఫోటోను కాంగ్రెస్ ఇప్పుడు వాడుకుంటోందని ఆయన ఆధారాలతో సహా బయటపెట్టారు. "ఇలాంటి చర్యలతో కాంగ్రెస్ పార్టీ తనను తాను అవమానించుకోవద్దు" అని ఆయన హితవు పలికారు. ప్రధాని నరేంద్ర మోదీ బలమైన నాయకత్వంలో దేశం సురక్షితంగా ఉందని, ఇంధన సరఫరాకు ఎలాంటి ఢోకా లేదని రిజిజు భరోసా ఇచ్చారు. మరోవైపు, బీజేపీ జాతీయ ఐటీ సెల్ ఇన్‌చార్జ్ అమిత్ మాలవీయ కూడా ఈ విషయంపై స్పందించారు. ఇరాన్ సంక్షోభం తర్వాత జీ20 దేశాల్లో పెట్రోల్ ధరల పెరుగుదలను వివరిస్తూ ఓ జాబితాను విడుదల చేశారు. ఆ జాబితా ప్రకారం, అమెరికాలో 22 శాతం ధర పెరగగా, భారత్‌లో మాత్రం ధరల్లో ఎలాంటి మార్పు లేదు. భారత్‌తో పాటు సౌదీ అరేబియా, ఇండోనేషియాలో కూడా ధరలు పెరగలేదని ఆయన పేర్కొన్నారు. దేశంలో ముడి చమురు, పెట్రోల్, డీజిల్, ఎల్పీజీలకు సరిపడా నిల్వలు ఉన్నాయని విదేశాంగ శాఖ కూడా స్పష్టం చేసింది. ఇరాన్ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించాలని భారత్ పిలుపునిచ్చిందని, సముద్ర వాణిజ్య కార్యకలాపాలకు భద్రత కల్పించి భారతీయ నావికులను స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.



## పాక్‌లో భగ్గుమన్న పెట్రో ధరలు

ఇస్లామాబాద్: రంజాన్ మాసం వేళ పాకిస్థాన్‌లో ఇంధన ధరలు భారీగా పెరగడం సామాన్య ప్రజల నడ్డి విరుస్తోంది. ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌పై ఏకంగా 55 రూపాయల మేర పెంచింది. దాంతో పెట్రోల్ ధర లీటర్ రూ.321కి పెరిగింది. డీజిల్ ధర కూడా అదే స్థాయిలో భగ్గుమంటోంది. ఈ పరిణామంతో దేశవ్యాప్తంగా రవాణా ఛార్జీల నుంచి నిత్యావసరాల ధరల వరకు అన్నింటిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇంధన ధరల పెంపు మధ్యతరగతి కుటుంబాలు, రోజువారీ కూలీలపై పెనుభారం మోపుతోందని 'డాన్' పత్రిక తన నివేదికలో వెల్లడించింది. రంజాన్ మాసంలో సాధారణంగానే కుటుంబ బడ్జెట్‌లు ఒత్తిడికి గురవుతాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ఉపశమనం కల్పించాల్సింది పోయి, ధరలు పెంచడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈద్ పండుగ ఖర్చుల కోసం సిద్ధమవుతున్న తరుణంలో ఈ భారం వారి కొనుగోలు శక్తిని దెబ్బతీస్తోందని నివేదిక పేర్కొంది. పాకిస్థాన్ ఎక్కువగా ఇంధన దిగుమతులపై ఆధారపడటంతో అంతర్జాతీయ మార్పులు దేశీయ ధరలను కుదిపేస్తున్నాయి. ధరల పెంపు ప్రకటన వెలువడిన గంటల వ్యవధిలోనే దేశంలోని కరాచీ, పెషావర్ వంటి ప్రధాన నగరాల్లో రవాణా ఛార్జీలు పెరిగాయి. దీంతో ప్రజా రవాణాపై ఆధారపడే లక్షలాది మంది రోజువారీ ఖర్చులు అమాంతం పెరిగాయి. ఇంధన ధరలు పెరిగిన వెంటనే వ్యాపారులు నిత్యావసరాల ధరలను పెంచుతున్నారని, మరోవైపు పెషావర్‌లో పెట్రోల్ అమ్మకాలు కూడా గణనీయంగా తగ్గినట్లు డీలర్లు చెబుతున్నారు. ఈ పరిణామాలతో ప్రజల ఆర్థిక ఇబ్బందులు మరింత తీవ్రమయ్యాయి.

## ఎన్డీయేతో పొత్తు ఉండదు

### టీవీకే అధినేత విజయ్

చెన్నై: తమిళనాడులో ఎన్డీయే కూటమితో పొత్తు ఎట్టి పరిస్థితుల్లో ఉండదని టీవీకే అధిపతి విజయ్ స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆయన చెబుతున్నారు. ఒక పొత్తుల విషయం వస్తే ఎన్డీయేతో కలిసే ప్రసక్తి ఉండదని కూడా క్లారిటీగా చెప్పేస్తున్నారు. అంటే పొత్తులు ఎవరితోనూ ఉండవని ఒక వైపు చెబుతూనే ఎన్డీయేతో అసలు ఉండదని కచ్చితంగా విజయ్ తేల్చేశారు అన్న మాట అని విశ్లేషిస్తున్నారు. విజయ్ పార్టీ ఎన్డీయేలో చేరుతుందని ఈ మేరకు చర్చలు రాయబారాలు అన్నీ జరుగుతున్నాయని, అవి వదంతులేనని టీవీకే పేర్కొంది. ఎన్డీయే తో పొత్తు మీద జరుగుతున్న ప్రచారం అంతా ఊహాగానాలు అని టీవీకే పార్టీ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్ ప్రకటించారు. అంతే కాదు తాము ఈ విషయాన్ని గతంలోనే స్పష్టంగా చెప్పామని ఆయన గుర్తు చేస్తున్నారు. బీజేపీతో టీవీకే పార్టీ దూరం పాటించడం ఎందుకు అన్న దానికి కూడా టీవీకే వివరణ ఇచ్చింది. తమ పార్టీకి టీవీకే సైద్ధాంతిక శత్రువు అని కూడా క్లియర్ కట్ గా చెప్పేస్తోంది. అందుకే ఆ పార్టీతో దూరం పాటిస్తున్నామని నిర్మల్ కుమార్ చెప్పారు. ఇక టీవీకే పార్టీ క్యాడర్ కానీ నాయకులు పార్టీ నుంచి అధికారిక ప్రకటన వస్తేనే నమ్మాలి కానీ ఈ తరహా ప్రచారాలను నమ్మరాదని ఆయన సూచించారు. దాంతో ఎన్డీయేతో విజయ్ పార్టీ జట్టు కడుతుందని వస్తున్న వార్తలను ఆ పార్టీ ఈ విధంగా క్లారిటీ ఇచ్చింది అని అంటున్నారు.

## మెటాలో 16,000 మంది ఉద్యోగులపై వేటు?




సోషల్ మీడియా దిగ్గజం మెటాలో మరోసారి ఉద్యోగాల కోతకు రంగం సిద్ధమవుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో దూసుకెళ్లేందుకు భారీగా పెట్టుబడులు పెడుతున్న సంస్థ.. ఖర్చులను తగ్గించుకునేందుకు ఏకంగా 20 శాతం మంది సిబ్బందిని తొలగించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై తుది నిర్ణయం, కచ్చితమైన తేదీ ఇంకా ఖరారు కాలేదు. కంపెనీ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ గత కొంతకాలంగా జనరేటివ్ ఏఐపై పూర్తిగా దృష్టి సారించారు. దీని కోసం పరిశోధకులకు భారీ ప్యాకేజీలు ఇవ్వడంతో పాటు డేటా సెంటర్ల నిర్మాణానికి బిలియన్ల డాలర్లు వెచ్చిస్తున్నారు. ఈ క్రమంలో పెరుగుతున్న వ్యయాలను నియంత్రించేందుకు ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. "గతంలో పెద్ద బృందం చేసే పనిని, ఇప్పుడు ఏఐ సాయంతో ఒక ప్రతిభావంతుడైన వ్యక్తి చేయగలడు" అని జుకర్‌బర్గ్ ఇటీవలే వ్యాఖ్యానించడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. డిసెంబర్ 31 నాటికి మెటాలో సుమారు 79,000 మంది ఉద్యోగులు ఉన్నారు. తాజా ప్రణాళిక అమలైతే దాదాపు 16,000 మంది తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుంది. ఇప్పటికే 2022లో 11,000 మందిని, 2023లో 10,000 మందిని మెటా తొలగించింది. ఈసారి జరగబోయే తొలగింపులు సంస్థ చరిత్రలోనే కీలకమైనవిగా మారనున్నాయి. కేవలం మెటా మాత్రమే కాదు, ఇతర టెక్ కంపెనీలు కూడా ఇదే బాటలో పయనిస్తున్నాయి.

## కొచ్చి నుంచి అర్మేనియాకు 100 మంది ఇరాన్ నావికులు

కొచ్చి: సాంకేతిక సమస్య కారణంగా కొచ్చి తీరంలో నిలిచిపోయిన ఇరాన్ నౌక ఐరిస్ లావన్‌కు చెందిన సుమారు 100 మంది సిబ్బంది భారత్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరినట్లుగా వార్తలు వస్తున్నాయి. అయితే నావికులు వెళ్లినట్లు అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. 183 మంది నావికులతో బయలుదేరిన ఐరిస్ లావన్ నౌకలో సమస్య రావడంతో కొచ్చి తీరంలో నిలిపేందుకు ఇరాన్ అనుమతి కోరగా, భారత్ అంగీకరించింది. దీనితో ఈ నౌక దాదాపు పది రోజులుగా కొచ్చి తీరంలో ఉంటోంది. నౌకలోని సిబ్బంది అక్కడే ఉంటున్నారు. అయితే వీరిలో కొంతమంది శుక్రవారం రాత్రి విమానంలో వెళ్లిపోయారు. నావికులతో పాటు వేర్వేరు కారణాల వల్ల భారత్‌లో చిక్కుకున్న సుమారు 30 మంది ఇరానీ పౌరులు కూడా ఆ ప్రత్యేక విమానంలో ప్రయాణించారు. ఈ విమానం అర్మేనియా వెళ్లినట్లు తెలుస్తోంది. మీడియా కథనాల ప్రకారం, ఇరానియన్ సిబ్బంది కొలంబో నుంచి కొచ్చి చేరుకున్న విమానంలో ఎక్కారు. శుక్రవారం రాత్రి ఈ విమానం ఆలస్యంగా విమానాశ్రయం నుంచి బయలుదేరింది. ఈ విమానం అర్మేనియా వెళ్లినట్లు తెలుస్తోంది. ఇరాన్ ప్రభుత్వం ఆ విమానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. యుద్ధ నౌక మిగిలిన సిబ్బందితో కొచ్చిలోనే ఉంది.

## ఎలక్ట్రిక్ స్టవ్ వాడితే యూనిట్‌కు రూ.2 సబ్సిడీ

### తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం

చెన్నై: పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో వంటగ్యాస్ సంక్షోభం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా పలు నగరాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. వంటగ్యాస్ కొరత నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన సీనియర్ అధికారులు సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. టీస్టాళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, క్లౌడ్ కిచెన్ సహా ఆహార తయారీ కేంద్రాలు ఏవైనా ఎల్పీజీకి బదులుగా ఎలక్ట్రిక్ స్టౌవ్‌లను ఉపయోగిస్తే ఒక యూనిట్ విద్యుత్‌పై రూ.2 సబ్సిడీ అందించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. వాణిజ్య సిలిండర్ల కొరత తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో వంటగ్యాస్ కొరత తీవ్రత తగ్గేవరకు సబ్సిడీ వర్తిస్తుందని వెల్లడించారు.


## టికెట్లపై 'ఆకాశ ఎయిర్' ఇంధన సర్ చార్జ్

న్యూఢిల్లీ: విమాన ప్రయాణికులకు మరో భారం పడింది. ప్రముఖ విమానయాన సంస్థలు ఎయిర్ ఇండియా, ఇండిగో బాటలోనే తాజాగా ఆకాశ ఎయిర్ కూడా పయనించింది. విమాన ఇంధనం ధరలు పెరగడంతో టికెట్లపై ఇంధన సర్ చార్జ్‌ను ప్రవేశపెడుతున్నట్లు శనివారం ప్రకటించింది. ఈ కొత్త ఛార్జీలు మార్చి 15 అర్ధరాత్రి 12:01 గంటల నుంచి చేసే అన్ని బుకింగ్‌లకు వర్తిస్తాయని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు గణనీయంగా పెరిగాయని ఆకాశ ఎయిర్ ఒక ప్రకటనలో తెలిపింది. విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చులలో ఇంధనానిదే సింహభాగమని, ఈ పెరుగుదల తమపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోందని వివరించింది. ఈ నేపథ్యంలో దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో ప్రయాణించే దూరాన్ని బట్టి ఒక్కో టికెట్‌పై రూ. 199 నుంచి రూ. 1,300 వరకు సర్ చార్జ్‌ను విధిస్తున్నట్లు పేర్కొంది. అయితే, మార్చి 15 కంటే ముందు బుక్ చేసుకున్న టికెట్లపై ఈ అదనపు భారం ఉండదని ఆకాశ ఎయిర్ స్పష్టం చేసింది. సర్ చార్జ్ విధించినప్పటికీ, తమ ప్రయాణికులకు మెరుగైన సేవలు, సరసమైన ధరలు అందించడంపై దృష్టి సారిస్తామని హామీ ఇచ్చింది.

ఈవార్తలు
వినోదవాణి
CINEMA
ఆదివారం 15-3-2026, జగిత్యాల | www.evarthalu.com




లయ్యారి చిత్రం




## ఉస్తాద్ భగత్ సింగ్' ట్రైలర్ రిలీజ్..

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా థియేట్రికల్ ట్రైలర్ వచ్చేసింది. శనివారం సాయంత్రం చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ ట్రైలర్‌ను విడుదల చేసింది. "ఇచ్చిపడేసే గోత్రం.. ఇరగదీసే నక్షత్రం" అంటూ పవన్ మార్కు డైలాగులతో ఉన్న ట్రైలర్ ఈ యాక్షన్ థ్రిల్లర్ సినిమాపై భారీ అంచనాలను పెంచేసింది. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఉగాది పండుగ కానుకగా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. వాస్తవానికి మార్చి 26న విడుదల కావాల్సి ఉన్నా, మరో సినిమా వాయిదా పడటంతో 'ఉస్తాద్' ముందుగానే థియేటర్లలోకి వస్తోంది. ఈ సినిమాకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది.

**ఏపీలో ఉస్తాద్ అడ్వాన్స్ బుకింగ్స్ షురూ**

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ నెల 19న వస్తున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఒక కీలకమైన అప్‌డేట్ వచ్చింది. ఏపీలో ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. దీంతో థియేటర్ల వద్ద సందడి మొదలైంది. బ్లాక్‌బస్టర్ హిట్ 'గబ్బర్ సింగ్' తర్వాత పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై మొదటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టే ఇప్పుడు సినిమా సందడి మొదలైంది. ఏపీలోని పలు సినిమా హాళ్లు నెమ్మదిగా అడ్వాన్స్ బుకింగ్స్‌ను తెరుస్తున్నాయి. ఇందులో బెనిఫిట్ షోలకు సంబంధించిన టికెట్లను కూడా అందుబాటులో ఉంచుతున్నారు. త్వరలోనే అన్ని థియేటర్లలోనూ బుకింగ్స్ పూర్తిస్థాయిలో మొదలుకానున్నాయి.

**నేడే ఉస్తాద్ ప్రీ రిలీజ్ ఈవెంట్**

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా సందడి మొదలైంది. ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఉగాది పండుగ కానుకగా మార్చి 19న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ గ్రాండ్ ఈవెంట్‌కు హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్ వేదిక కానుంది. మార్చి 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఈ వేడుక ప్రారంభమవుతుంది. ఈవెంట్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చిత్ర బృందం తెలిపింది.

## నేనింకా కమిట్ కాలేదు: లోహర్

పెళ్లి గురించి కయాదు లోహర్ కీలక వ్యాఖ్యలు చేసింది. పెళ్లి చేసుకునే ఆలోచన ఉందని, తప్పకుండా తాను పెళ్లి చేసుకుంటాను అని చెప్పుకొచ్చింది. ఆ సమయంలోనే యాంకర్ మాట్లాడుతూ కయాదు లోహర్ ప్రేమలో ఉందా, ఎవరితో అయినా రిలేషన్‌లో ఉందా అంటూ ప్రశ్నించింది. అప్పుడు కయాదు గట్టిగా నవ్వుతూ ప్రస్తుతానికి నేను పనితోనే రిలేషన్‌లో ఉన్నాను, పనితో మాత్రమే ప్రేమలో ఉన్నాను అని నవ్వింది. క్లియర్‌గా చెప్పాలంటే నేను సింగిల్‌గానే ఉన్నాను. కమిట్ కాలేదు అంటూ క్లారిటీ ఇచ్చింది. గతంలో ఈమె ఒక యంగ్ హీరోతో ప్రేమలో ఉందనే పుకార్లు షికార్లు చేశాయి. ఆ వార్తలపై కయాదు స్పందించలేదు. దాంతో కయాదు ప్రేమ వ్యవహారం గురించి అంతా సైలెంట్ అయ్యింది. ప్రస్తుతానికి సింగిల్ అయినప్పటికీ తాను భవిష్యత్తులో పెళ్లి చేసుకునే ఆలోచనతో ఉన్నట్లు చెప్పుకొచ్చింది.




## నిర్మాతగా నష్టపోయా: విజయ్ సేతుపతి



సాధారణంగా సినీ పరిశ్రమలో తమ వైఫల్యాలను దాచుకోవాలని చూసే వారు ఎక్కువగా ఉంటారు. కానీ తమిళ నటుడు విజయ్ సేతుపతి మాత్రం తాను నిర్మాతగా మారి తీసిన సినిమాలన్నీ నష్టాలనే మిగిల్చాయని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. కేవలం లాభాల కోసం కాకుండా, వైవిధ్యమైన కథల మీద ఉన్న మక్కువతోనే తాను సినిమాలు తీశానని ఆయన స్పష్టం చేశారు. నిర్మాతగా విజయ్ సేతుపతి తన ప్రయాణాన్ని 'సంగుతేవన్' అనే చిత్రంతో ప్రారంభించగా, అది మధ్యలోనే ఆగిపోవడంతో సుమారు రూ. 1.75 కోట్ల నష్టం వాటిల్లింది. ఆ తర్వాత ఆయన తన సొంత బ్యానర్‌పై నిర్మించిన ఆరెంజ్ మిఠాయి, మేర్కు తోడర్చి మలై, జుంగా, లాభమ్ వంటి చిత్రాలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ, ఆర్థికంగా మాత్రం ఆయనకు చేదు అనుభవాన్నే మిగిల్చాయి. అయినప్పటికీ, మనసుకు నచ్చిన కథలను వెండితెరకు పరిచయం చేశానన్న తృప్తి తనకు ఉందని, ఆ సినిమాల విషయంలో తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని ఆయన చెప్పుకొచ్చారు.

## వైరముత్తుకు జ్ఞానపీఠ్ అవార్డు

న్యూఢిల్లీ: ప్రముఖ తమిళ కవి, సినీ గీత రచయిత ఆర్. వైరముత్తు దేశ అత్యున్నత సాహిత్య పురస్కారమైన జ్ఞానపీఠ్‌కు ఎంపికయ్యారు. 2025 సంవత్సరానికి గాను 60వ జ్ఞానపీఠ్ అవార్డుకు ఆయనను ఎంపిక చేసినట్టు భారతీయ జ్ఞానపీఠ్ సంస్థ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. తమిళ సాహిత్యానికి ఆయన అందించిన విశేష సేవలు, సృజనాత్మకతకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్టు పేర్కొంది. ప్రముఖ రచయిత్రి ప్రతిభా రే అధ్యక్షతన సమావేశమైన భారతీయ జ్ఞానపీఠ్ సెలక్షన్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. 1953లో తమిళనాడులో జన్మించిన వైరముత్తు, నాలుగు దశాబ్దాలుగా సాహితీ రంగంలో తనదైన ముద్ర వేశారు. కవిత్వం, నవలలతో కలిపి ఆయన 37కు పైగా పుస్తకాలను రచించారు. 'కళ్ళికాట్టు ఇతిహాసం', 'కరువాచ్చి కావియం', 'తన్నీ దేశం' వంటివి ఆయన ప్రసిద్ధ రచనలలో కొన్ని. వైరముత్తు తన కెరీర్‌లో ఇప్పటికే ఎన్నో ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. ఏడుసార్లు ఉత్తమ గీత రచయితగా జాతీయ అవార్డును గెలుచుకున్నారు. భారత ప్రభుత్వం ఆయనను 2003లో పద్మశ్రీ, 2014లో పద్మభూషణ్‌తో సత్కరించింది. ఆయన రాసిన 'కళ్ళికాట్టు ఇతిహాసం' నవలకు సాహిత్య అకాడమీ పురస్కారం కూడా లభించింది.



## కొరియాలో వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం 'కొరియన్ కనకరాజు'. హారర్ కామెడీ జానర్‌లో వస్తున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. తాజాగా చిత్ర యూనిట్ చివరి షెడ్యూల్ కోసం దక్షిణ కొరియాకు పయనమైంది. అక్కడ కీలకమైన చిత్రీకరణను ప్రారంభించినట్టు సమాచారం. దర్శకుడు మేర్లపాక గాంధీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కొరియాలో వారం రోజుల పాటు ఈ చివరి షెడ్యూల్ జరగనుంది. ఈ షెడ్యూల్‌లో వరుణ్ తేజ్, హీరోయిన్ రితికా నాయక్, నటుడు సత్యలపై కొన్ని ముఖ్యమైన సన్నివేశాలతో పాటు పాటలను కూడా చిత్రీకరించనున్నారు. కొరియాలోని అందమైన లొకేషన్లలో ఈ షూటింగ్ జరగనుంది. ఇప్పటికే ఇండియాలో మేజర్ పార్ట్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఈ షెడ్యూల్‌తో చిత్రీకరణను పూర్తి చేసుకోనుంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. ఇండియా, కొరియా నేపథ్యంలో సాగే ఈ కథలో వరుణ్ తేజ్ మునుపెన్నడూ చూడని కొత్త అవతార్‌లో కనిపిస్తారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే వరుణ్ తేజ్ పుట్టినరోజున విడుదలైన టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తుండగా, మనోజ్ రెడ్డి కాటసాని సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. కొరియా షెడ్యూల్ పూర్తయిన వెంటనే పోస్ట్-ప్రొడక్షన్ పనులు వేగవంతం చేయనున్నారు.



## అది నా డ్రీమ్
### భూమి పడ్నేకర్

బాలీవుడ్ నటి భూమి పడ్నేకర్ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన మనసులోని మాటను బయటపెట్టారు. రణ్‌వీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్' చూసిన తర్వాత ఆ సినిమా మేకింగ్‌కు తాను ఫిదా అయ్యానని, దర్శకుడు ఆదిత్య ధర్, రణ్‌వీర్ సింగ్‌లతో కలిసి పనిచేయడం తన కల అని ఆమె పేర్కొన్నారు. సాధారణంగా మితిమీరిన మాస్ ఎలిమెంట్స్ ఉండే చిత్రాలు చూస్తే తనకు నిద్ర వస్తుందని, కానీ 'ధురంధర్' మాత్రం తనను కట్టిపడేసిందని భూమి నిజాయతీగా చెప్పారు. సినిమా కలెక్షన్ల ధోరణిపై కూడా భూమి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పరిశ్రమలో 'ఓపెనింగ్ వీకెండ్' కలెక్షన్ల ఆధారంగానే సినిమా ఫలితాన్ని నిర్ణయించేస్తున్నారని, దీనివల్ల కంటెంట్ ఉన్న చిన్న సినిమాలు థియేటర్లలో నిలబడలేకపోతున్నాయని ఆమె విశ్లేషించారు. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలు నెమ్మదిగా ప్రేక్షకాదరణ పొందుతాయని, కానీ శుక్రవారం నాటి అంకెలను చూసి జడ్జిమెంట్ ఇవ్వడం సరికాదని అభిప్రాయపడ్డారు.



## సినీ నటి పూర్ణకు బేబీ గర్ల్

టాలీవుడ్ నటి, 'ఢీ' ఫేమ్ పూర్ణ (షామ్నా ఖాసిమ్) తన అభిమానులతో ఒక సంతోషకరమైన వార్తను పంచుకున్నారు. ఆమె రెండోసారి తల్లి అయ్యారు. ఈ ఉదయం 4.25 గంటలకు ఒక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు సోషల్ మీడియా వేదికగా ఆమె ప్రకటించారు. తన జీవితంలోకి వచ్చిన ఈ చిన్నారి అపురూపమైన కానుక అని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా డెలివరీ సాఫీగా జరిగినందుకు దేవుడికి, ఆసుపత్రి సిబ్బందికి పూర్ణ తన కృతజ్ఞతలు తెలిపారు. పూర్ణకు 2022లో దుబాయ్ వ్యాపారవేత్త షానిద్ ఆసిఫ్ అలీతో వివాహం జరిగింది. వీరికి 2023లో బాబు హమ్దాన్ జన్మించాడు. ఇప్పుడు మరోసారి తల్లి అయినట్టు పూర్ణ తీపి కబురు అందించారు. ఈ సందర్భంగా సినీ తారలు, అభిమానులు పూర్ణ దంపతులకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలుపుతున్నారు.



## బాలీవుడ్‌లో బిజీగా సాయి పల్లవి

సౌత్ ఇండియా నేచురల్ బ్యూటీ సాయి పల్లవి సిని పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ ఇప్పుడు బాలీవుడ్‌ను ఏలేందుకు సిద్ధమవుతోంది. అసలు తన తొలి హిందీ సినిమా విడుదల కాకముందే అక్కడ వరుస ఆఫర్లతో వార్తల్లో నిలుస్తోంది. అమీర్ ఖాన్ కొడుకు జునైద్ ఖాన్‌తో 'ఏక్ దిన్', రణబీర్ కపూర్‌తో ప్రతిష్టాత్మక 'రామాయణం' వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు మరో ఐకానిక్ రోల్ కోసం చర్చల్లో ఉంది. దిగ్గజ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బులక్ష్మి గారి బయోపిక్‌లో సాయి పల్లవి నటించబోతున్నట్లు సమాచారం. 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమా కోసం ఆమెను ఫైనలైజ్ చేశారని టాక్. మరో క్రేజీ ఆఫర్ కూడా ఆమె తలుపు తట్టినట్లు తెలుస్తోంది. బాలీవుడ్ లెజెండరీ బ్యూటీ మధుబాల బయోపిక్‌ను అగ్ర దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ప్లాన్ చేస్తున్నారు. ఈ పాత్ర కోసం కియారా అద్వానీ వంటి స్టార్ల పేర్లు వినిపించినా, భన్సాలీ మాత్రం సాయి పల్లవి వైపే మొగ్గు చూపుతున్నట్లు బాలీవుడ్ మీడియా కోడై కూస్తోంది.



ఈవార్తలు
# క్రీడావాణి SPORTS
ఆదివారం 15-3-2026, జగిత్యాల | www.evarthalu.com | 7





# బుమ్రా ప్రత్యేకం
## పాక్ సెలెక్టర్



టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బూమ్రాపై పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్, ప్రస్తుత సెలక్టర్ ఆకిబ్ జావేద్ ప్రశంసల వర్షం కురిపించాడు. బూమ్రా బౌలింగ్ అత్యంత విభిన్నంగా ఉంటుందని, మ్యాచ్‌లో బ్యాటర్లను ఏమాత్రం కుదురుకోనివ్వడని కొనియాడారు. ఇటీవల ముగిసిన 2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించిన బూమ్రా, 14 వికెట్లతో టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఒకరిగా నిలిచిన సంగతి తెలిసిందే. శనివారం జరిగిన ఓ మీడియా సమావేశంలో ఆకిబ్ జావేద్ మాట్లాడుతూ బూమ్రా బౌలింగ్ శైలిని ప్రత్యేకంగా అభినందించాడు. "ప్రస్తుత తరంలో, ఈ ప్రపంచకప్ మొత్తంలో బూమ్రా లాంటి బౌలర్ ఒక్కడే ఉన్నాడు. ఎందుకంటే అతను చాలా భిన్నమైనవాడు, సాధారణ బౌలర్ కాదు. అతని బౌలింగ్ యాక్షన్ కూడా అసాధారణంగా ఉంటుంది. బంతిని వేగంగా, విలక్షణమైన శైలిలో విసరడంతో బ్యాటర్లు అతని బౌలింగ్‌లో లయను అందుకోలేరు. దానికి బూమ్రా అస్సలు అవకాశం ఇవ్వడు" అని వివరించాడు. గతంలో పాకిస్థాన్ దిగ్గజాలు వసీం అక్రమ్, వకార్ యూనిస్‌లు ఎంతటి ప్రభావం చూపించేవారో, ఇప్పుడు బూమ్రా అటువంటి ప్రభావమే చూపిస్తున్నాడని జావేద్ అభిప్రాయపడ్డాడు.

# ఘనంగా కుల్దీప్ పెళ్లి
## వేడుకల్లో క్రికెటర్ల సందడి

టీమిండియా యువ సంచలనం కుల్దీప్ యాదవ్ తన స్నేహితురాలు వన్షికను హిల్‌స్టేషన్ ముస్సోరీలో వివాహం చేసుకుంటున్నాడు. ఈ వేడుకలో పాల్గొనేందుకు తిలక్ వర్మ శనివారం డెహ్రాడూన్‌లోని జాలీ గ్రాంట్ విమానాశ్రయానికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో తిలక్ వర్మ మాట్లాడాడు. "కుల్దీప్ పెళ్లి వేడుకను ఆస్వాదించడానికి వచ్చాం. ఇది ముగిసిన తర్వాత ఐపీఎల్ కోసం సన్నద్ధమవుతాం" అని తెలిపాడు. రాబోయే ఐపీఎల్‌లో తిలక్ వర్మ ముంబై ఇండియన్స్ తరఫున ఆడనున్నాడు. దేశం కోసం మరిన్ని ట్రోఫీలు గెలవడమే తమ లక్ష్యమని, ఎవరు ఆడినా దేశం గెలుపు కోసమే ఆడతారని స్పష్టం చేశాడు. అటు.. తిలక్ వర్మ కంటే ముందే సురేశ్ రైనా, రింకూ సింగ్, యుజ్వేంద్ర చాహల్, మహ్మద్ కైఫ్‌తో పాటు భారత ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ వంటి ప్రముఖులు వేడుకలకు హాజరయ్యారు.

## ఢిల్లీ క్యాపిటల్స్‌కు పీటర్సన్ గుడ్ బై



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ ఎడిషన్ ప్రారంభానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) ఫ్రాంచైజీకి వీడ్కోలు పలుకుతున్నట్లు ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ తెలిపాడు. జట్టు మెంటార్ బాధ్యతల నుంచి తాను తప్పుకుంటున్నట్లు శనివారం ప్రకటించాడు. అయితే, ఈ లీగ్ లో గతంలో మాదిరే కామెంటేటర్‌గా కొనసాగుతానని స్పష్టం చేశాడు. గతేడాది ఫిబ్రవరిలో ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం పీటర్సన్‌ను మెంటార్‌గా నియమించింది. హెడ్ కోచ్ హేమాంగ్ బదానీ, అసిస్టెంట్ కోచ్ మాథ్యూ మోట్, బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్ వంటి సపోర్ట్ స్టాఫ్‌తో కలిసి కేపీ పనిచేశాడు. "ఈ ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు మెంటార్‌గా కొనసాగలేను. ఈ బాధ్యతలకు అవసరమైన సమయాన్ని కేటాయించలేకపోతున్నాను. ఆటగాళ్లందరికీ శుభాకాంక్షలు. అయితే, కామెంటరీ బాక్స్‌లో మళ్లీ కలుస్తాను" అని 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశాడు. దక్షిణాఫ్రికాలో జన్మించిన పీటర్సన్, ఇంగ్లండ్ తరఫున 104 టెస్టులు, 136 వన్డేలు ఆడాడు. 2010 టీ20 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచి ఇంగ్లండ్‌కు తొలి ఐసీసీ ట్రోఫీని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, పుణే జట్లకు ప్రాతినిధ్యం వహించాడు.

## పాక్ బ్యాటర్ సల్మాన్ అలీ ఆఘాకు ఐసీసీ మందలింపు

బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో వన్డేలో పాకిస్థాన్ బ్యాటర్ సల్మాన్ ఆఘా ఐసీసీ చర్యలకు గురయ్యాడు. విచిత్ర రీతిలో రనౌట్ కావడంపై అసహనం వ్యక్తం చేస్తూ క్రికెట్ పరికరాలను దురుసుగా విసిరికొట్టినందుకు అతడిని మందలించడంతో పాటు, ఒక డిమెరిట్ పాయింట్‌ను జతచేశారు. శుక్రవారం షేర్-ఎ-బంగ్లా స్టేడియంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సల్మాన్ ఆఘా, మహ్మద్ రిజ్వాన్ కలిసి 109 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. పాకిస్థాన్ ఇన్నింగ్స్ 39వ ఓవర్‌లో బంగ్లా కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ వేసిన బంతిని రిజ్వాన్ నెమ్మదిగా పుష్ చేశాడు. నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో క్రీజు బయట ఉన్న పాక్ బ్యాటర్ ఆఘా వద్దకు బంతి దొర్లుకుంటూ వచ్చింది.



అతడు బంతిని చేత్తో పట్టుకుని బౌలర్‌కు తిరిగి ఇవ్వబోయాడు. వెంటనే అప్రమత్తమైన మిరాజ్... ఆఘా కంటే ముందే ఆ బంతిని అందుకుని వికెట్లను గిరాటేశాడు. ఆఘా క్రీజు బయటే ఉండటంతో థర్డ్ అంపైర్ అతడిని రనౌట్‌గా ప్రకటించాడు. ఈ ఊహించని పరిణామంతో తీవ్ర నిరాశకు గురైన సల్మాన్ ఆఘా, పెవిలియన్‌కు వెళుతూ కోపంతో తన గ్లోవ్స్‌ను నేలకేసి కొట్టాడు. ఇది ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2ను ఉల్లంఘించడమే. ఈ విషయంపై మ్యాచ్ రిఫరీ నేమూర్ రషీద్ 'ది డైలీ స్టార్'తో మాట్లాడుతూ.. "సల్మాన్‌కు గతంలో ఇలాంటి ప్రవర్తనకు పాల్పడిన చరిత్ర లేదు. అన్ని అంశాలను, ఐసీసీ నిబంధనలను పరిగణలోకి తీసుకుని అతడిని మందలించి, ఒక డిమెరిట్ పాయింట్ ఇచ్చాం" అని వివరించారు.


## ఒలింపిక్స్, ఫిఫా వరల్డ్‌కప్‌లో
# ట్రంప్‌పై నిషేధం

పశ్చిమాసియాలోని ఇరాన్ నుంచి తీవ్రమైన ప్రతిఘటన ఎదుర్కొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కి మరో షాక్ తగలనుంది. ప్రపంచక ఫుట్‌బాల్ సమాఖ్య(ఫిఫా) ఆయనపై నిషేధం విధించాలనే ఆలోచనతో ఉంది. పిఫా వరల్డ్‌కప్ పోటీలతో పాటు లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ 2028కు హాజరవ్వకుండా ట్రంప్‌పై నిషేధం పడే అవకాశముంది. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థకు చెల్లించాల్సిన బకాయిలు భారీగా పేరుకుపోవడమే అందుకు కారణమని సమాచారం. గత కొన్నేళ్లుగా యూఎస్ఏ ప్రభుత్వానికి, ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థకు పొసగడం లేదు. దాంతో.. మూడేళ్ల నుంచి వాడాకు యూఎస్ ప్రభుత్వం ఒక్క డాలర్ కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం యూఎస్ఏ చెల్లించాల్సిన బకాయిల మొత్తం 7.3 మిలియన్ డాలర్ల(రూ.67 కోట్లకు పైగా)గా ఉన్నాయి.




దాంతో.. వాడాకు బాకీపడిన దేశాలకు చెందిన అధ్యక్షులను, ప్రతినిధులను ఒలింపిక్స్, వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ వంటి ప్రధాన క్రీడలకు, స్పోర్ట్స్ ఈవెంట్లకు అనుమతించకూడదనే ప్రతిపాదన ఉంది. కాబట్టి.. ఫిఫా వరల్డ్‌కప్‌తో పాటు లాస్ ఎంజెలెస్ ఒలింపిక్స్‌లో ఈవెంట్లో పాల్గొనకుండా అమెరికా అధినేతపై నిషేధం విధించే అవకాశముందని సమాచారం. అయితే.. వాడా అధికార ప్రతినిధి జేమ్స్ ఫిట్జెరాల్డ్ మాత్రం అదేమీ లేదని అంటుండడం గమనార్హం. జో బైడెన్ హయాం నుంచే వాడాపై అమెరికా కినుక వహిస్తోంది. డోపింగ్‌లో పట్టుబడిన ఆటగాళ్లను ఒలిపింక్స్ పోటీల్లో అనుమతించడాన్ని వ్యతిరేకిస్తూ వాడాకు నిధులు ఇవ్వడం ఆపేసింది యూఎస్ఏ. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కూడా ఈ విధానాన్నే అనుసరించడంతో వాడాకు అమెరికా నుంచి డాలర్లు ముట్టడం లేదు. 2014లో సోచి గేమ్స్‌కు ముందు రష్యా డోపింగ్ కుంభకోణంలో, పారిస్ ఒలింపిక్స్‌లో 23 మంది చైనా అథ్లెట్లు పట్టుడినా వాడా చర్యలు తీసుకోకపోవడమే అమెరికా ఆగ్రహానికి కారణం. 'వాడా హెచ్చరికలు చేస్తున్నా సరే మా దేశం నిర్ణయంలో మార్పు ఉండదు. డోపింగ్ విషయంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని మేము డిమాండ్ చేస్తున్నాం' అని అమెరికా జాతీయ డ్రగ్స్ నియంత్రణ విధానం డైరెక్టర్ సారా కార్టెర్ ఒక ప్రకటనలో తెలిపారు.





# సబలెంకా వర్సెస్ రిబాకినా

ఈ ఏడాది టెన్నిస్ ఆరంభ సీజన్ టోర్నీ అయిన ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్‌లో ఫైనల్‌లో ఢీకొన్న అరీనా సబలెంకా (బెలారస్), ఎలీనా రిబాకినా (కజకిస్థాన్) మరోసారి టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ ఇద్దరూ బీఎన్‌పీ పారిబాస్ ఓపెన్ (ఇండియన్ వెల్స్) టోర్నీలో ఫైనల్‌కు చేరారు. మహిళల సింగిల్స్ సెమీస్‌లో టాప్ సీడ్ సబలెంకా.. 6-3, 6-4తో లిండా నొస్కొవ (చెక్)పై సునాయస విజయం సాధించింది. గడిచిన నాలుగేండ్లలో ఆమెకు ఇది మూడో ఫైనల్ కావడం విశేషం. రెండో సెమీస్‌లో రిబాకినా.. 7-5, 6-4తో స్వితోలినా (ఉక్రెయిన్)ను చిత్తుచేసి సబలెంకాతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైంది. ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్‌లో ఈ ఇద్దరి మధ్య జరిగిన ఫైనల్‌లో రిబాకినానే అదృష్టం వరించిన విషయం తెలిసిందే. కాగా పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యూకీ బాంబ్రీ జోడీ పోరాటం సెమీస్‌కే పరిమితమైంది. తొలిసారి ఏటీపీ మాస్టర్స్ 1000 టోర్నీలో సెమీస్‌కు చేరిన బాంబ్రీ, గొరన్సన్ (స్వీడన్) జోడీ.. 5-7, 7-6 (7/3) 5-10తో ఆర్థర్ రిండర్‌నెక్ (ఫ్రాన్స్), వాలెంటిన్ (మొనాకో) చేతిలో ఓడింది.



## బ్యాడ్మింటన్ స్కోరింగ్ మార్పులపై సైనా అసహనం

భారత బ్యాడ్మింటన్ దిగ్గజం సైనా నెహ్వాల్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య ప్రతిపాదిస్తున్న స్కోరింగ్ మార్పులపై తన వ్యతిరేకతను వ్యక్తం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 21 పాయింట్ల (3 - 21) విధానాన్ని మార్చి, దాని స్థానంలో 15 పాయింట్ల (3 - 15) విధానాన్ని తీసుకురావాలనే ఆలోచనను ఆమె తీవ్రంగా వ్యతిరేకించింది. పాత విధానమే (21 పాయింట్లు) క్రీడాకారుల ఓర్పును, ఆట అసలైన నైపుణ్యాన్ని పరీక్షిస్తుందని ఆమె అభిప్రాయపడింది. డెన్మార్క్‌లోని హెర్సెన్స్‌లో ఏప్రిల్ 25న జరగనున్న బీడబ్ల్యూఎఫ్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ 15 పాయింట్ల విధానంపై ఓటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో, ఇంటర్నేషనల్ మూమెంట్ టు యునైటెడ్ నేషన్స్ సలహాదారుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సైనా, ఆట స్ఫూర్తిని కాపాడాలని పిలుపునిచ్చింది. 15 పాయింట్ల విధానం వల్ల ర్యాలీలు తగ్గిపోయి, ఆట నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని, ఇది కేవలం అదృష్టంపై ఆధారపడేలా మారుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. కాబట్టి, అధికారులు వాణిజ్య పరమైన కోణంలో కాకుండా... క్రీడాకారుల సంక్షేమం, ఆట సంప్రదాయం వైపు నుంచి ఆలోచించాలని కోరింది.

ఈవార్తలు
# ప్రజావాణి
ఆదివారం 15-3-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు




# ఐరాస.. అస్తిత్వ ప్రయాస!

**ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధాన్ని అడ్డుకోవడంలో విఫలం..**
**రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడంలో విఫలం..**
**గాజా సంక్షోభాన్ని నివారించడంలో విఫలం..**
**సూడాన్ అంతర్యుద్ధాన్ని నిలువరించడంలో విఫలం..**
**వీటో అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవడంలో విఫలం..**
**కొవిడ్-19.. దేశాల యుద్ధాలు.. వివాదాలు..**
**ఇలా ఏ అంశమైనా ఐరాసది ప్రేక్షక పాత్రే..!**
**మారని వ్యవస్థతో మానవ హక్కులకు పాతరే..!**

ఐక్యరాజ్యసమితి (ఐరాస) స్థాపన వెనుక ఉన్న ప్రధాన ఆశయం ప్రపంచ శాంతిని నెలకొల్పడం, యుద్ధాలను నివారించడం. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సంస్థ ఒక చర్చా వేదికగా మాత్రమే మిగిలిపోయింది. గత కొన్నేళ్లుగా జరుగుతున్న ఘోరమైన యుద్ధాలను ఆపడంలో యూఎన్ దారుణంగా విఫలమైంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 'మరో యుద్ధం రాకూడదు' అనే నినాదంతో పుట్టిన ఈ సంస్థ.. నేడు రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-గాజా, సుడాన్ వంటి దేశాల్లో జరుగుతున్న మారణహోమాన్ని చూస్తూ ఉండిపోతోంది. అందుకే భారత ప్రధాని నరేంద్ర మోదీ.. యూఎన్ లాంటి సంస్థలు 'అవుట్ డేటెడ్ సాఫ్ట్‌వేర్' అన్నారు.



శ్రావణ్ కుమార్
బొమ్మకంటి
ఎడిటర్, 9581291919

పశ్చిమాసియాలో దశాబ్దాలుగా రగులుతున్న నివురు గప్పిన నిప్పు ఇప్పుడు పెను దావానలంలా మారింది. ఇజ్రాయెల్-అమెరికా కూటమి, ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు కేవలం ఆ దేశాలకే కాక, యావత్ ప్రపంచానికి ముప్పుగా పరిణమించాయి. ఈ మహా సంక్షోభం వేళ ప్రపంచ శాంతిని కాపాడాల్సిన ఐక్యరాజ్యసమితి ఒక నిశ్శబ్ద ప్రేక్షక పాత్రకే పరిమితం కావడం అత్యంత ఆందోళనకరం. యుద్ధం మొదలైనప్పటి నుండి ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ దౌత్య ప్రయత్నాలు విఫలమయ్యాయంటూ విచారం వ్యక్తం చేయడం తప్ప, ఆచరణాత్మకమైన అడుగులు వేయలేకపోయారు. క్షిపణి దాడులు, వైమానిక దాడులతో సామాన్య ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా, శాంతి చర్చల కోసం అవకాశం 'చేజారిపోయిందని' ప్రకటించి చేతులు దులుపుకోవడం ఐరాస వైఫల్యానికి నిదర్శనం. విరుద్ధమైన సిద్ధాంతాల ముసుగులో జరుగుతున్న ఈ ఏకపక్ష దాడులను అరికట్టడంలో ఐరాస భద్రతా మండలి పూర్తిగా విఫలమైంది. వీటో అధికారం కలిగిన అగ్రరాజ్యాలు తమ స్వార్థ రాజకీయాల కోసం ఐరాసను పావుగా వాడుకుంటున్నాయనే విమర్శలు నిజమనిపిస్తున్నాయి. యుద్ధం కారణంగా ఇంధన మార్కెట్లు అస్తవ్యస్తమై ప్రపంచ దేశాలపై ఆర్థిక భారం పడుతోంది. ఇరాన్ తన పంతం వీడకుండా గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులు చేస్తూ ఉద్రిక్తతలను మరింత పెంచుతోంది. ఈ పరిస్థితులు మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే అవకాశం ఉన్నప్పటికీ, ఐరాస గట్టి హెచ్చరికలు జారీ చేయలేకపోయింది. అణ్వాయుధ యుద్ధ భయం వెంటాడుతున్న తరుణంలో కూడా ఐరాస అశక్తత రాజ్యమేలుతోంది. కేవలం ప్రకటనలు చేయడానికి, విచారం వ్యక్తం చేయడానికి పరిమితమైతే ఐరాస వంటి సంస్థల ఉనికిపైనే ప్రశ్నలు తలెత్తుతాయి. యుద్ధాన్ని తక్షణమే నిలిపివేసి, ఇరుపక్షాలను చర్చలకు తీసుకురావడంలో ఐరాస తన నైతిక బలాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ వ్యవస్థను రూల్స్-బేస్డ్ సిస్టమ్‌గా మార్చాల్సిన బాధ్యతను ఐరాస విస్మరిస్తే, చరిత్ర దానిని కేవలం ఒక వైఫల్య చిహ్నంగానే చూస్తుంది.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా స్వయంగా భద్రతా మండలిలో శాశ్వత సభ్యురాలు కావడంతో, తనపై వచ్చే ప్రతి శాంతి తీర్మానాన్ని వీటో అధికారం ద్వారా అడ్డుకుంటోంది. దీనివల్ల ఈ యుద్ధాన్ని ఆపడానికి ఐరాసకు ఎటువంటి చట్టపరమైన అధికారం లేకుండా పోయింది. ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధంలో వేల మంది మంది పౌరులు, ముఖ్యంగా 70% మంది మహిళలు మరియు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. తక్షణ కాల్పుల విరమణ కోసం ప్రతిపాదించిన తీర్మానాలను అమెరికా పలుమార్లు వీటో చేయడం వల్ల ఐరాస ఏమీ చేయలేకపోయింది. ఐరాస వైఫల్యానికి ప్రధాన కారణం భద్రతా మండలిలోని ఐదు దేశాలకు (అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్) ఉన్న వీటో అధికారం. అమెరికా తన మిత్రదేశమైన ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా వచ్చే దాదాపు అన్ని తీర్మానాలను వీటో చేస్తోంది. సిరియా, ఉక్రెయిన్ లేదా వెనిజులా వంటి విషయాల్లో రష్యా, చైనా తమ ప్రయోజనాల కోసం వీటోను వాడుకుంటూ మానవ హక్కుల ఉల్లంఘనలపై చర్యలను అడ్డుకుంటున్నాయి. గాజాలో మారణహోమం జరుగుతోందని ఐరాస నిపుణులు హెచ్చరించినప్పటికీ, క్షేత్రస్థాయిలో హింసను ఆపడానికి అవసరమైన సైనిక లేదా ఆర్థిక చర్యలను ఐరాస తీసుకోలేకపోతోంది. శక్తివంతమైన దేశాల (ముఖ్యంగా అమెరికా) ఉల్లంఘనలను ప్రశ్నించే ధైర్యం ఈ సంస్థలకు లేదనే విమర్శ బలంగా ఉంది. భద్రతా మండలి స్థాపించినప్పటి నుండి రష్యా సుమారు 159 సార్లు, అమెరికా 93 సార్లు వీటో అధికారాన్ని ఉపయోగించాయి.

ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల గురించి మాట్లాడే అంతర్జాతీయ సంస్థలు అమెరికా విషయంలో మాత్రం మెతక వైఖరిని అవలంబిస్తాయనే విమర్శ బలంగా ఉంది. అమెరికా తన విదేశాంగ విధానంలో భాగంగా చేసే దాడులను (ఉదాహరణకు గతంలో ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ దాడులు) ఈ సంస్థలు గట్టిగా ప్రశ్నించలేవు. భారత్ వంటి దేశాల్లో చిన్న సంఘటనలు జరిగినా నివేదికలు ఇచ్చే ఈ సంస్థలు, అమెరికాలో గన్ కల్చర్, జైళ్లలో వివక్ష లేదా ఇజ్రాయెల్‌కు అందుతున్న సైనిక మద్దతు వల్ల జరుగుతున్న పౌర మరణాలపై నామమాత్రపు విమర్శలతో సరిపెట్టుకుంటున్నాయి. ఇలా.. యూఎన్ విఫలమవుతున్న తరుణంలో, ప్రపంచ దేశాలన్నీ కలిసి 'బహుళ ధ్రువ ప్రపంచం' వైపు అడుగులు వేస్తున్నాయి. అంటే అధికారం ఒక్క అమెరికా లేదా పీ5 దేశాల దగ్గరే కాకుండా, అన్ని ప్రాంతాలకు సమానంగా ఉండాలని కోరుకుంటున్నాయి.

## ఐరాసపై మోదీ వ్యాఖ్యలు ఇవీ..

ప్రస్తుత కాలంలో ఐరాస తన ప్రాముఖ్యతను కోల్పోతోందని, అది తన బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమవుతోందని స్పష్టంగా పేర్కొన్నారు. 2025 మార్చిలో లెక్స్ ఫ్రిడ్‌మాన్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. 'ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, వివాదాలు పెరుగుతున్నప్పటికీ ఐరాస వంటి సంస్థలు వాటిని ఆపలేకపోతున్నాయి. అందుకే అవి దాదాపు అప్రస్తుతంగా మారిపోయాయి. 20వ శతాబ్దంలో పుట్టిన ఈ సంస్థలు 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కోలేకపోతున్నాయి. 21వ శతాబ్దపు సాఫ్ట్‌వేర్‌ను 20వ శతాబ్దపు టైప్‌రైటర్లతో నడపలేం. ఐరాస తన ఉనికిని కాపాడుకోవాలంటే తక్షణమే సంస్కరణలు చేపట్టాలి. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్ వంటి దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించాలి. కొవిడ్-19 సమయంలో కానీ, రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-గాజా యుద్ధాల విషయంలో కానీ ఐరాస తన పాత్రను సమర్థంగా పోషించలేకపోయింది' అని పేర్కొన్నారు. చివరగా, ఐరాస కేవలం ఒక మాటల వేదికగా మిగిలిపోతుందని స్పష్టం చేశారు.

## చేతులెత్తేసిన ఐరాస

- గాజాలో కాల్పుల విరమణ కోసం ప్రతిపాదించిన అనేక తీర్మానాలను అమెరికా వీటో చేసింది. ఫలితంగా వేల మంది పౌరులు, ముఖ్యంగా మహిళలు, పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు.
- రష్యా స్వయంగా భద్రతా మండలిలో శాశ్వత సభ్యురాలు కావడంతో, తనపై వచ్చే ఏ తీర్మానాన్ని అయినా వీటో ద్వారా అడ్డుకుంటోంది. దీంతో ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ఆపడంలో యూఎన్ నిస్సహాయంగా మారింది.
- 2023 అక్టోబర్ నుండి 2025 సెప్టెంబర్ మధ్యలో గాజాలో 63,000 పైగా పాలస్తీనియన్లు మరణించినట్లు అంచనా. ఇందులో 70% మంది మహిళలు, పిల్లలే ఉండటం గమనార్హం.
- 2024 జూన్ నాటికి యుద్ధాలు మరియు హింస కారణంగా ప్రపంచవ్యాప్తంగా 12.26 కోట్ల మంది బలవంతంగా తమ ఇళ్లను వదిలి వలస వెళ్లాల్సి వచ్చింది.
- 1994లో రువాండాలో జరిగిన జాతి నిర్మూలన, 1995లో బోస్నియాలోని స్రెబ్రెనికా ఊచకోత వంటి సందర్భాల్లో కూడా యూఎన్ శాంతి దళాలు అక్కడే ఉన్నప్పటికీ మారణకాండను ఆపలేకపోయాయి.

## ఐరాస అసమర్థతకు ఆధారాలివీ..

- 2024లో ప్రపంచవ్యాప్తంగా జరిగిన యుద్ధాల్లో దాదాపు 1.29 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు.
- యుద్ధాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా 12.26 కోట్ల మంది నిరాశ్రయులయ్యారు.
- ప్లాస్టిక్ రహిత సమాజాన్ని తయారుచేయడంలో ఐరాస ఘోరంగా విఫలం అవుతోంది.
- ప్రజల మానవ హక్కులను కాపాడటంలో ఐరాస ప్రయత్నాలు శూన్యం.
- అనేక దేశాలు ఎదుర్కొంటున్న ఉగ్రవాదానికి అడ్డుకట్ట వేయడంలో ఐరాస పాత్ర సున్నా.
- తన ప్రాథమిక లక్ష్యం.. శాంతి భద్రతలు కాపాడటం. ఆ లక్ష్యాన్నే ఐరాస మరిచింది.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.